Postal Licence No. L/KNL/3-19(D). 2016 - 2018


# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 207 పేజీలు 8 వెల : 5 బుధవారం 04 మార్చి 2026



గల్ఫ్‌లోని చమురు శుద్ధి కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్న ఇరాన్

సాదీలోని అతి పెద్ద కేంద్రంపై దాడి - తాత్కాలికంగా మూసివేత

2లో..

# యుద్ధం తీవ్రరూపం

## ఇరాన్‌పై బాంబుల వర్షం కురిపిస్తున్న అమెరికా, ఇజ్రాయెల్

ఎల్ఎన్‌జీ ఉత్పత్తిని నిలిపేసిన ఖతార్ ఎనర్జీ

నెతన్యాహు ఇంటిపై దాడి చేశాం: ఇరాన్

తప్పుడు వార్తలు: ఇజ్రాయెల్

గాయపడిన ఖమేనీ సతీమణి మృతి

యుద్ధంలోకి మిలిటెంట్ గ్రూపులు

చమురు నౌకపై దాడిలో భారతీయుడి మృతి

*బహ్రెయిన్, సౌదీ అరేబియాలపై దాడులు ఆ దేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘిస్తున్నాయి. ఈ ప్రాంతంలో త్వరగా శాంతి, సుస్థిరతలు నెలకొనడం అత్యంత ప్రాధాన్య అంశమని మేము అంగీకరిస్తున్నాం.*





పశ్చిమాసియాకు, అమెరికా ప్రజలకు ఇరాన్ తీవ్ర ముప్పుగా పరిణమించింది. పశ్చిమాసియాలో ఉగ్రవాదులకు నిధులను, ఆయుధాలను సరఫరా చేస్తోంది. ఇరాన్‌పై ఆపరేషన్‌లో ఒక విషయం స్పష్టం. ఆ దేశ క్షిపణి సామర్థ్యాన్ని, నౌకాదళాన్ని నాశనం చేయడం, అణ్వాయుధాలు తయారుచేయకుండా అడ్డుకోవడమే మా లక్ష్యం.

**ఇరాన్‌లో 555 మంది మృతి**

అమెరికా-ఇజ్రాయెల్ దాడుల కారణంగా ఇరాన్‌లో 555 మంది మరణించారు. ఇరాన్‌లో మరణించిన వారిలో చైనా జాతీయుడు ఒకరు ఉన్నారు. ఇరాన్‌లోని 130 నగరాలపై దాడులు జరిగాయి. సోమవారం మధ్యాహ్నం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై యుద్ధ విమానాలు విరుచుకుపడ్డాయి.









# అటవీశాఖ హనుమాన్ ప్రాజెక్ట్

అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంగళవారం భేటీ అయ్యారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్, అటవీ శాఖలకు సంబంధించిన వివిధ అంశాలపై ఇరువురు చర్చించారు. జల్ జీవన్ మిషన్ పనుల పురోగతి, నిధుల వినియోగం, పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని రోడ్ల అభివృద్ధికి కేటాయించిన నిధులు, నియోజకవర్గాల వారీగా జరిగిన కేటాయింపులు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పంచాయతీల్లో చేపట్టిన 'మ్యాజిక్ డ్రెయిన్స్' పనుల గురించి సీఎంకు డిప్యూటీ సీఎం వివరించారు. అన్ని పంచాయతీల్లో ఈ తరహా డ్రెయిన్లు నిర్మించడం ద్వారా పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా అమలు చేయాలని ఇరువురు చర్చించారు. నీటిపారుదల శాఖ పరిధిలోని డ్రైనేజీల్లో పూడిక తీత అంశాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రస్తావించారు. వేసవిలోనే పూడిక తీత పనులు చేపట్టి.. రైతులు పంటలు వేసేలోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. అటవీ శాఖ చేపట్టిన 'హనుమాన్ ప్రాజెక్ట్' వివరాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వివరించారు.



## స్త్రీశక్తి పథకంతో తగ్గిన రోడ్డు ప్రమాదాలు

సిఎం చంద్రబాబుతో ప్రకాశం ఎస్పీ

రాష్ట్రవ్యాప్తంగా అధ్యయనం చేయాలని అధికారులరు సిఎం సూచన

2లో..



2లో..

## ఏజెన్సీ, చిత్తూరుల్లో ఏనుగుల సమస్య పరిష్కరించాం

హనుమాన్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిన డిప్యూటి సిఎం

అటవీ సరిహద్దు గ్రామాల్లో అలర్ట్ వ్యవస్థ ఏర్పాటు

ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా పవన్ కళ్యాణ్

# అవయవదానంలో రాష్ట్రానికి ఆరోస్థానం

## కేంద్ర గణాంకాలు వెల్లడి: మంత్రి సత్యకుమార్




అమరావతి: అవయవదానంలో రాష్ట్రానికి ఆరో స్థానం లభించిందని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా అవయవదానాల్లో ఏపీ ఆరో స్థానంలో నిలిచిందన్నారు. మంగళవారం జీవన్‌దాన్ కార్యకలాపాలపై మంత్రి సత్యకుమార్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండు నెలల్లో రాష్ట్రంలో 64 మందికి కొత్త జీవితం లభించిందని అన్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది అవయవదానంపై స్పందన గణనీయంగా పెరిగిందన్నారు. యువత, మధ్య వయస్సు వారిలో అవయవదానం పట్ల అవగాహన పెరుగుతున్నట్లు స్పష్టమవుతోందన్నారు. అవయవాల కోసం వేచి ఉన్న 5000 మందిలో 50 ఏళ్ల లోపు వారే అత్యధికంగా ఉన్నారని మంత్రి వెల్లడించారు. గత ఏడాది 301 అవయవమార్పుడులు జరిగాయన్నారు. 93 మంది బ్రెయిన్ డెడ్ అయిన వారి నుంచి అవయవాలు సేకరించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవయవ మార్పిడి శస్త్రచికిత్సల సంఖ్యను మరింత పెరగాలని సూచించారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలు జారీ చేశారు



# అంగన్‌వాడీలపై దమనకాండ

ప్రభుత్వ తీరుపై మండిపడ్డ అంగన్‌వాడీలు



అక్రమ అరెస్టులను ఖండించిన పది లెఫ్ట్ పార్టీలు

# పరస్పర దాడులతో దద్దరిల్లుతున్న పశ్చిమాసియా



టెహ్రాన్: ఇజ్రాయెల్, అమెరికా దాడులు.. ఇరాన్ ప్రతిదాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. వరుస బాంబు దాడులతో దద్దరిల్లుతున్నాయి. పశ్చిమాసియాలో నాలుగో రోజు కూడా దాడులు, ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. అమెరికా మద్దతుతో ఇరాన్‌పై ఇజ్రాయెల్ మిసైళ్లతో విరుచుకుపడుతోంది. ఇరాన్ రాజధాని నగరం టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ దాడులను ఉధృతం చేసింది. సోమవారం రాత్రి పక్కా ఇంటిలిజెన్స్ సమాచారంతో టెహ్రాన్ నడిబొడ్డున ఉన్న పలు కీలక ప్రాంగణాలపై దాడులు జరిపామని, అధ్యక్ష కార్యాలయం, సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ భవనంపై బాంబులు జారవిడిచామని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ తెలిపింది. ఇదే ఏరిపాయాలోని ఇరాన్ మిలటరీ అధికారులకు శిక్షణ ఇచ్చే సంస్థపైన, ఇతర మౌలిక సదుపాయాలపైన కూడా దాడి చేసినట్టు చెప్పింది. కాగా, తమ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీతో పాటు పలువురు సైనిక ఉన్నతాధికారులను కోల్పోవడంతో ఇరాన్ సైతం ప్రతీకార దాడులు కొనసాగిస్తోంది. ఇజ్రాయెల్‌తో పాటు మధ్యప్రాచ్యంలోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్‌లతో దాడులు చేస్తోంది. రియాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయాన్ని ఇరాన్ డ్రోన్ ఒకటి మంగళవారంనాడు ఢీకొంది. దీంతో మంటలు చెలరేగాయి. అయితే స్వల్పనష్టమే జరిగినట్టు సౌదీ అరేబియా తెలిపింది. కువైట్‌లోని అమెరికా ఎంబసీని కూడా ఇరాన్ డ్రోన్ ఢీకొనడంతో తాత్కాలికంగా ఎంబసీని మూసివేశారు. కాగా, ఇరాన్ దాడులపై ట్రంప్ మంగళవారంనాడు మరోసారి హెచ్చరికలు చేశాయి. సుదీర్ఘమైన దాడులకు తాము సిద్ధమని, తొలుత నాలుగు, ఐదు వారలు అనుకున్నప్పటికీ అంతకంటే ఎక్కువ రోజులు కొనసాగించే సత్తా కూడా తమకుందని చెప్పారు.

తాజా దాడుల్లో ఇరాన్ కొత్త రక్షణ మంత్రి సైయద్ మాజిద్ అల్-రేజా మృతి చెందినట్టు 'ది స్పెక్టేటర్ ఇండెక్స్' వెల్లడించింది. రెండు రోజుల క్రితమే ఇరాన్ రక్షణ మంత్రి అమీర్ సనీర్జాదే ఇజ్రాయెల్ దాడుల్లో మృతి చెందాడు. దీంతో వెంటనే కొత్త రక్షణ మంత్రిగా అల్-రేజా బాధ్యతలు చెపట్టారు. అల్ రేజా ఇంతకుముందు డిప్యూటీ రక్షణ మంత్రిగా ఉండేవారు. తాజాగా అల్‌రేజా కూడా తమ దాడుల్లో మరణించినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. అయితే ఇరాన్ మాత్రం అధికారికంగా ఈ వార్తను ధ్రువీకరించలేదు. ఇరాన్‌లోని సైనిక స్థావరాలు, చమురు క్షేత్రాలు, అణుశుద్ధి కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తోంది. ఈ దాడుల్లో ఇరాన్‌లోని నటాంజ్ అణు శుద్ధి కేంద్రంపై దాడి జరిగినట్టు ఇరాన్ ఇప్పటికే ప్రకటించింది. తాజాగా ఈ దాడిని ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ (ఎంఇం) ధ్రువీకరించింది. దాడుల తర్వాత సేకరించిన హై రిజల్యూషన్ ఉపగ్రహ చిత్రాలను విశ్లేషించామని, నటాంజ్ న్యూక్లియర్ సైట్ వద్ద స్ట్రక్చరల్ డ్యామేజ్ జరిగిందని తెలిపింది. ఫెసిలిటీ ప్రవేశద్వారం వద్ద ఉన్న భవంతులకు నష్టం జరిగినట్టు కనిపిస్తోందని పేర్కొంది. అయితే రేడియేషన్ లీక్ అయిన సంకేతాలు ఏమీ లేవని వెల్లడించింది. ఇజ్రాయెల్ గత ఏడాది ఇరాన్‌పై 12 రోజుల పాటు దాడి జరిపింది. ఆ దాడిలో నటాంజ్ అణుశుద్ధి కేంద్రానికి భారీ నష్టం వాటిల్లింది. ఆ సమయంలో అమెరికా సైతం నటాంజ్, మరో రెండు అణు కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపింది. తాజాగా మరోసారి నటాంజ్ న్యూక్లియర్ సైట్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడి చేసినట్టు ఐఏఈఏలో ఇరాన్ రాయబారి ఆదివారంనాడు వెల్లడించారు. అయితే దీనిని ఐక్యరాజ్యసమితి అణు నిఘా సంస్థ డైరెక్టర్ జనరల్ రాఫెల్ గ్రాస్సీ తోసిపుచ్చారు. దాడి జరిగిందనడానికి ఎలాంటి సాక్ష్యం లేదన్నారు. వాస్తవ సమాచారం కోస ఇరాన్ న్యూక్లియర్ రెగ్యులేరటీ అథారిటీని సంప్రదిస్తున్నట్టు చెప్పారు. కాగా, ఇజ్రాయెల్ దాడులు మొదలు పెట్టినప్పటి నుంచి ఇంతవరకూ 787 మంది పౌరులు మరణించినట్టు ఇరాన్ అధికారులు తెలిపారు. వీరిలో ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీ, ఆయన కుటుంబానికి చెందిన మరో నలుగురు, పలువురు సైనిక ఉన్నతాధికారులు ఉన్నారు. ఇజ్రాయెల్ దాడిని దురాక్రణ చర్యగా అభివర్ణించిన ఇరాన్.. వెనక్కి తగ్గేదిలేదని, ప్రతీకారం తీర్పుకుంటామని ప్రకటించింది.

## మూడు వారాల్లోగా ఇబ్రహింపట్నం మున్సిపల్ ఎన్నిక

**రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశాలు**

హైదరాబాద్:ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికపై హైకోర్టు తుది తీర్పు ఇచ్చింది. మూడు వారాల్లోగా ఎన్నిక పక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి మంగళవారం తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కౌన్సిలర్లు ఎలాంటి ఒత్తిడికి లోనవకుండా తమ మద్దతు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని వెల్లడించింది. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక జరగాల్సిన సమయంలో 19వ కార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ ఆకుల యాదగిరి కనిపించకుండా పోయాడు. దీంతో తన తండ్రిని ప్రత్యర్థి పార్టీ నేతలు కిడ్నాప్ చేశారంటూ యాదగిరి కుమారుడు హైకోర్టులు హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు.

ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక పక్రియపై స్టే విధించింది. మంగళవారం ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను మూడు వారాల్లోపు పూర్తి చేయాలని తుది తీర్పును వెలువరించింది .

## మూసీ ఒడ్డున భారీ అక్రమ నిర్మాణం

హైదరాబాద్: హైడ్రాకు రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమ వెంచర్లు కనిపించడం లేదా అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. నార్సింగిలోని ఓ వెంచర్ వద్ద స్థానికులతో కలిసి ఆమె ధర్నా చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఆమెను అదుపులోకి తీసుకొని పోలీసు వాహనాల్లో తరలిస్తుండగా.. జాగృతి కార్యకర్తలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, జాగృతి కార్యకర్తల మధ్య తోపులాట చోటు చేసుకుంది. అంతకుముందు మూసి నది పక్కన నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌పై కవిత ఆరోపణలు చేశారు. మధ్యాహ్నం నుంచి ఆ వెంచర్ వద్దే బైఠాయించారు. సాయంత్రం సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులోనే ధర్నా కొనసాగించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ వచ్చే వరకు కదిలేది లేదని స్పష్టం చేశారు. మూసీని ఆనుకుని భారీ రియల్ ఎస్టేట్ వెంచర్ ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. పేదల ఇళ్లు కూలుస్తూ రియల్ ఎస్టేట్‌వెంచర్లను వదిలేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ నార్సింగి పరిధిలోని మూసీ నదిని ఆక్రమించి శ్రీ ఆదిత్య లగ్జరీ అపార్ట్‌మెంట్స్ నిర్మిస్తున్నారని కవిత ఆరోపించారు. నది పరివాహక ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా ఈ వెంచర్ సాగుతోందని ఆమె మండిపడ్డారు. ఈ అక్రమ నిర్మాణాల వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ ప్రాజెక్టుపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు పేరుతో సామాన్యుల ఇళ్లను తొలగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఈ భారీ వెంచర్‌ను ఎందుకు చూడటంలేదని ఆమె నిలదీశారు. పేదల గూడు చెడగొట్టే హైడ్రా అధికారులకు ఈ అక్రమ నిర్మాణాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. చట్టం అందరికీ సమానంగా వర్తించాలని, కేవలం పేదలపైనే ప్రతాపం చూపడం సరికాదని కవిత హితవు పలికారు. రియల్ ఎస్టేట్ మాఫియా అండతోనే ఇలాంటి భారీ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆమె విమర్శించారు. సామాన్యుల పక్షాన నిలబడి తమ పోరాటం కొనసాగిస్తామని ఈ సందర్భంగా కవిత స్పష్టం చేశారు. ప్రకృతి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆమె గుర్తు చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# ప్రజలకు సంక్షేమ పథకాలు చేరవేయాలి




హైదరాబాద్: రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌పై లబ్దిదారుల అభిప్రాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సచివాలయంలో కలెక్టర్లతో సీఎం సమావేశమయ్యారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికపై కలెక్టర్లకు దిశా నిర్దేశర చేశారు. 99 రోజుల కార్యాచరణలో అందరి భాగస్వామ్యం ఉండాలని సీఎం పిలుపునిచ్చారు. గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలి. విద్యావ్యవస్థలో తీసుకువస్తున్న మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రభుత్వ ఆస్పత్రులను మెడికల్ కాలేజీలతో అనుసంధానం చేయాలి. మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు ప్రతినెలా బిల్లులు చెల్లించాలని సీఎం అన్నారు. సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో అధికారులు, కలెక్టర్లకు పలు కీలక సూచనలు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రాధాన్యత అంశాలు, పాలనాపరమైన సంస్కరణలపై ఈ సందర్భంగా చర్చించారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.మరోవైపు పలువురు కలెక్టర్లపై సీఎం సీరియస్ అయ్యారు. కొంత మంది కలెక్టర్లు జిల్లా హెడ్ క్వార్టర్ లో ఉండటం లేదన్నారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి క్షేత్రస్థాయిలో అందుబాటులో లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. అలాంటి వారు తమ పని తీరు మార్చుకోవాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 99 రోజుల పాటు జిల్లా విడిచి వెళ్లొద్దని ఆదేశించారు. ఈ గడువులోగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పాలనను పరుగులు పెట్టించాలని సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశర చేశారు. 99రోజుల పాటు జిల్లాను విడిచి వెళ్లొద్దని సీఎం ఆదేశించారు. రాజధాని శివారు జిల్లాల కలెక్టర్లు.. సీఎస్ కె.రామకృష్ణారావు అనుమతి లేకుండా హైదరాబాద్ వస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో వేగం పెంచే లక్ష్యంతో ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక పేరుతో 99 డేస్ యాక్షన్ ప్లాన్ అమలు చేయబోతోందన్నారు. జిల్లాల్లో బాగా పని చేసిన కలెక్టర్లకు సీఎం గ్రేడింగ్ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తాజా మీటింగ్‌లో పనితీరు ఆధారంగా కలెక్టర్లకు సీఎం గ్రేడింగ్ ఇవ్వనున్నారని ఆశించిన మేరకు పని తీరు చూపని కలెక్టర్లకు దిశానిర్దేశర చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో పలువురు మంత్రులు, సీఎస్, ఉన్నతాధికారులు, కలెక్టర్లు పాల్గొన్నారు. ఈనెల 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికను నిర్వహిస్తుంది. అయిదు దశల్లో 99 రోజుల పాటు జరిగే కార్యక్రమానికి నోడల్ శాఖ గా వ్యవహరిస్తున్న ప్రణాళిక శాఖ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. ఏప్రిల్ 2న గ్రామ స్థాయిలో గ్రామ సభల నిర్వహణ ,ఏప్రిల్ 16న మండల స్థాయిలో , మే 2న నియోజకవర్గ స్థాయి , మే 22న జిల్లా స్థాయిలో కార్యక్రమాలు ఉంటాయని ఆ శాఖ వెల్లడించింది. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుక నిర్వహించనున్నట్లు తెలిపింది. 10 వివిధ థీమ్‌లతో శాఖల వారీగా 99 రోజుల కార్యక్రమం ఉంటుందని వివరించింది. మొదటి థీమ్‌లో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ ఆఫీసుల్లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ , రెండవ థీమ్‌లో ఆరోగ్యం 3లో అరైవ్.. అలైవ్, 4లో సంక్షేమం , 5లో పిల్లల భద్రత.. డ్రగ్స్ కు అడ్డుకట్ట, 6లో రైతు సంక్షేమం.. వ్యవసాయంపై కార్యక్రమాల నిర్వహణ ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. 7లో విద్య, 8లో యువత.. క్రీడలు, 9లో మహిళలు , 10వ థీమ్‌లో పర్యావరణంపై సమావేశాలు జరుగుతాయని తెలిపారు. మార్చి 6న అన్ని ఉమ్మడి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు , 99 రోజుల్లో శాఖల వారీగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలుంటాయని వివరించింది. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమ పర్యవేక్షణకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను తయారు చేశామని వెల్లడించింది .

## ఇరాన్ చర్చల ప్రతిపాదన

న్యూయార్క్: ఇరాన్‌పై యుద్ధం కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. చర్చలకు సిద్ధమని ఇరాన్ నేతలు చెప్పారని.. అయితే, ఇప్పటికే ఆలస్యమైందని చెప్పినట్టు పేర్కొన్నారు. ఇరాన్ నాయకత్వంతోపాటు ఆ దేశ గగనతల రక్షణ, వాయుసేన, నౌకాదళ వ్యవస్థలన్నీ తుడిచిపెట్టుకుపోయినట్టు తెలిపారు. ఈ మేరకు సొంత సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో వచ్చిన ఓ కథనాన్ని ట్రంప్ ఖండించారు. ఆ పత్రిక అభిప్రాయంతో ఏకీభవించడం లేదన్నారు. అమెరికా ఆయుధ నిల్వలు తక్కువగా ఉన్నాయని, ఎక్కువ కాలం యుద్ధం కొనసాగితే అవి నిండుకునే ప్రమాదం ఉందన్న వార్తలను అధ్యక్షుడు తోసిపుచ్చారు. మధ్యస్థ, ఉన్నతస్థాయి ఆయుధాలు అపరిమిత సంఖ్యలో ఉన్నాయని, అవి చాలా శక్తిమంతమైనవన్నారు.

ఇరాన్‌తో ఘర్షణల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తమవద్ద లెక్కలేనన్ని ఆయుధాలు ఉన్నాయని పోస్టు పెట్టారు. విజయవంతంగా ఎప్పటికీ యుద్ధం చేస్తూనే ఉండగలమని రాసుకొచ్చారు. అమెరికా కోసం ఉన్నతశ్రేణి ఆయుధాలను ఇతర దేశాల్లో కూడా నిల్వ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌పై విమర్శలు గుప్పించారు. ఆయన ఆయుధాల నిల్వలను సరిగా నిర్వహించలేదని, ఉక్రెయిన్‌కు భారీఎత్తున అధునాతన ఆయుధాలను పంపారని విమర్శించారు. 'అదృష్టవశాత్తూ నా తొలివిడత పాలనలోనే మిలిటరీని మెరుగుపర్చాను. అమెరికా వద్ద నిల్వలు భారీ విజయాలు సాధించేంతగా ఉన్నాయి' అని తన పోస్టులో పేర్కొన్నారు. ఇదిలాఉంటే.. ఇరాన్‌పై దాడుల గురించి కాంగ్రెస్ (అమెరికా చట్టసభలు)కు ట్రంప్ అధికారికంగా వెల్లడించారని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. దేశ ప్రజల ప్రయోజనాల కోసమే ఈ చర్యలు తీసుకున్నట్లు అధ్యక్షుడు సమర్థించుకున్నారు. అలాగే రానున్న 24 గంటల్లో ఇరాన్‌పై భీకర దాడులు చేయనున్నట్లు ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. తాము ఇప్పటివరకు పెద్ద దాడులే చేయలేదని వ్యాఖ్యలు చేయడం ఆందోళన రేకెత్తిస్తోంది.

## స్త్రీశక్తి పథకంతో తగ్గిన రోడ్డు ప్రమాదాలు

అమరావతి: రోడ్డు ప్రమాదాలపై రాష్ట్రవ్యాప్తంగా అధ్యయనం చేయాలంటూ ఉన్నతాధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. స్త్రీశక్తి పథకంతో రోడ్డు ప్రమాదాలు తగ్గాయని ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సిఎం చంద్రబాబుతో అన్నారు. దీంతో ఈ రకంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రమాదాలపై అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలను దశల వారీగా ప్రవేశపెట్టి.. అమలు చేస్తోంది. అందులో ఒక్కటి స్త్రీ శక్తి పథకం. ఈ పథకంలో భాగంగా మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణం కల్పించారు. ఈ పథకంతో రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుతున్నాయి.ఈ మేరకు ప్రకాశం జిల్లా పోలీసుల అధ్యయనంలో వెలుగులోకి వచ్చింది. మంగళవారం రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకాశం జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షను వర్చువల్‌గా నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య జిల్లాలో గణనీయంగా తగ్గిందంటూ సీఎం చంద్రబాబు దృష్టికి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తీసుకెళ్లారు.స్త్రీ శక్తి పథకం అమలుకు ఆరు నెలల ముందు, తర్వాత పోల్చుకుంటే..19 శాతం మేర మరణాలు తగ్గినట్టు ఈ జిల్లా పోలీసులు ఇచ్చిన నివేదికలో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఇదే తరహా అధ్యయనం చేయించాలంటూ ఉన్నతాధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశించారు. గతంతో పోల్చుకుంటే ప్రకాశం జిల్లాలో10 శాతం మేర మరణాలు తగ్గినట్టు నివేదికలో వెల్లడించారు.ం

## ఏజెన్సీ, చిత్తూరుల్లో ఏనుగుల సమస్య పరిష్కరించాం

అమరావతి:రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాలు, చిత్తూరు జిల్లాలో ఏనుగుల సమస్యను పరిష్కరించామని ఎపి డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ అన్నారు. మంగళవారం వన్యప్రాణుల సంరక్షణ కోసం ఎపి ప్రభుత్వం 'హనుమాన్' ప్రాజెక్టు ప్రారంభోత్సవంను మంగళగిరిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. అటవీ సరిహద్దు గ్రామాల్లో అలర్ట్ వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర అటవీశాఖ చరిత్రలో ఇదో కీలక అడుగు అని చెప్పారు. వన్యప్రాణులు, మనుషుల మధ్య సంఘర్షణ తగ్గించేందుకే ఈ ప్రాజెక్టును చేపట్టామన్నారు. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా మంగళగిరి ఏపీఎస్పీ బెటాలియన్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి కందుల దుర్గేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానవ - వన్యప్రాణుల సంఘర్షణను నివారించి, సహాయం అందించే 'హనుమాన్' ఫౌండేషన్ ప్రాజెక్టును డిప్యూటీ సీఎం ప్రారంభించారు. జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్‌ను కూడా ఆవిష్కరించారు. అనంతరం ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అటవీ శాఖ చరిత్రలో నేడు కీలకమైన రోజన్నారు. హనుమాన్ ప్రాజెక్టు ద్వారా మానవ - వన్యప్రాణి సంఘర్షణను తగ్గించడమే లక్ష్యమని చెప్పారు. వన్యప్రాణుల వల్ల పంట నష్టం, ప్రాణ నష్టం జరగకుండా ఈ ప్రాజెక్టు సహాయపడుతుందని తెలిపారు. ఏదైనా ఘటన జరిగిన వెంటనే స్పందించి సహాయ చర్యలు చేపట్టడం, పరిహారం అందించడం హనుమాన్ ఫౌండేషన్ బాధ్యత అని డిప్యూటీ సీఎం వివరించారు. ప్రాజెక్టులో 100 వాహనాలను అటవీ శాఖకు అందించామని పవన్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 19 అత్యవసర సహాయ బృందాలను సిద్ధం చేశామని పేర్కొన్నారు. ఏడు చోట్ల అత్యవసర చికిత్స, పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వన్యప్రాణుల దాడుల్లో గాయపడిన, మరణించిన వారికి 4 కోట్ల రూపాయల పరిహారం చెల్లించామన్నారు. మార్కెట్ విలువ ఆధారంగా పంట నష్ట పరిహారం ఇస్తున్నామని వెల్లడించారు. కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులు తెచ్చి అడవి ఏనుగులను కట్టడి చేశామని ఉపముఖ్యమంత్రి చెప్పారు. వన్యప్రాణి సంరక్షణను బాధ్యతగా చేపట్టామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ భూమిపై మనుషులతో పాటు జంతువులకూ స్థానం ఉందని ఆయన అన్నారు. హనుమాన్ ప్రాజెక్టును పకడ్బంధీగా రూపొందించిన అటవీ శాఖ అధికారులకు అభినందనలు తెలిపారు. ఈ ప్రాజెక్టులో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం కూడా తీసుకుంటామని పవన్ కళ్యాణ్ ప్రకటించారు. కార్యక్రమంలో అటవీ శాఖ ఏర్పాటు చేసిన వన్యప్రాణుల సంరక్షణ ప్రదర్శనను పవన్ తిలకించారు. అటవీ వన్యప్రాణి సంరక్షణలో పాలుపంచుకున్న అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వాలంటీర్లకు ప్రశంసా పత్రాలను అందజేశారు. హనుమాన్ ప్రాజెక్టు ద్వారా అటవీ శాఖకు రెస్క్యూ వాహనాలు, అంబులెన్సులను డిప్యూటీ సీఎం పవన్ అందజేశారు.

# అంగన్‌వాడీలపై దమనకాండ



విజయవాడ: వేతనాలు పెంచాలని కోరుతూ . శాంతియుతంగా విజయవాడలో ధర్నా చేస్తున్న అంగన్వాడీల పై ధమనకాండను ఖండిస్తూ?. రాష్ట్ర వ్యాప్తంగా నిరసనాగ్రహ జ్వాలలు వెల్లువెత్తాయి. చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలంటే అక్రమ అరెస్టులు చేస్తారా అంటూ అంగన్వాడీలు మండిపడ్డారు. వేతనాలు పెంచకుండా ప్రభుత్వం అంగన్వాడీల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా నిన్న ఉదయం నుండి 30 గంటల ధర్నా చేస్తున్న వేలాది మంది అంగన్వాడీలు నిద్రిస్తుండగా మంగళవారం తెల్లవారుజామున ధర్నా చౌక్ లో వారిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని 10 వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. అరెస్ట్ చేసిన అంగన్వాడీలను, వారి నాయకులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశాయి. దీనికి సంబంధించి మంగళవారం వామపక్షాలు ఓ ప్రకటనను విడుదల చేశాయి. నిద్రపోతున్న అంగన్‌వాడీ కార్యకర్తల పట్ల మగ పోలీసులు అమానుషంగా వ్యవహరించారని, పిన్నులతో గుచ్చారనీ, మహిళలపైన తాళ్ళువేసి, ముసుగు గుడ్డ కప్పి బలవంతంగా వ్యాన్‌లలో కుక్కారని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అంగన్వాడీల బ్యాగులు, సెల్‌ఫోన్‌లు తీసుకోనీయలేదు అని చెప్పారు. అంగన్‌వాడీ రాష్ట్ర నాయకులు బి.బేబిరాణి, కె.సుబ్బరావమ్మతో సహా ఆయా సంఘాలకు చెందిన సుమారు వెయ్యి మందిని అక్రమంగా అరెస్టు చేశారని తెలిపారు. అరెస్టయిన వారిని సుమారు 100 కిలోమీటర్ల దూరంలో పల్నాడు, ఏలూరు, నూజివీడు జిల్లాలోని నర్సారావుపేట, సత్తెనపల్లి, చాట్రాయి, బుట్టాయిగూడెం వగైరా సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లారని అన్నారు. ఉదయం 5 గంటల నుండి 10 గంటల వరకూ కాలకృత్యాలు తీర్చుకోనీయకుండా, వ్యాన్‌ల నుండి దింపకుండా అంగన్వాడీలను తిప్పారని చెప్పారు. మగ పోలీసులు దారుణంగా మహిళల పట్ల ఈ విధంగా వ్యవహరించడం అప్రజాస్వామికమని, ఇది నూటికి నూరుపాళ్లు మానవహక్కుల ఉల్లంఘనే అని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీలు ఆందోళన చేసిన సందర్భంగా ఆనాటి ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి ఒప్పందం చేసుకుందని గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అంగన్వాడీల ఉద్యమానికి మద్దతు ప్రకటించి, జీతాలు పెంచి న్యాయం చేస్తామని టిడిపి వాగ్దానం చేసింది? కానీ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం మాత్రం మాట తప్పి సమస్యలు పరిష్కరించకపోగా ఇప్పుడు వారిపైనే నిర్బంధానికి దిగడం దారుణమని, దీన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా నిరసిస్తున్నాయని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టకు పోకుండా అంగన్వాడీ యూనియన్ నాయకులతో వెంటనే చర్చించి వారి న్యాయమైన వేతనాల పెంపుదల తదితర డిమాండ్లను పరిష్కరించాలని పది వామపక్ష పార్టీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి.

## ఇరాన్‌పై దాడి పట్ల మౌనమెందుకు

న్యూఢిల్లీ: అమెరికా-ఇజ్రాయిల్-ఇరాన్‌ల వివాదంపై ప్రధాని మోడీ మౌనం ప్రపంచంలో భారత్ ఖ్యాతిని దిగజారుస్తోందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మంగళవారం పేర్కొన్నారు. ప్రపంచక్రమాన్ని నిర్వచించడానికి ఒక మార్గంగా దేశాధినేత హత్యకు మద్దతు ఇస్తున్నారా లేదా అనే దానిపై ప్రధాని మోడీ మాట్లాడాలని, సమాధానం చెప్పాలని అన్నారు. ఇరాన్‌పై ఏకపక్ష దాడులతో పాటు, ఇతర మధ్యప్రాచ్య దేశాలపపై ఇరాన్ దాడులను ఖండించాలని ఆయన అన్నారు. అమెరికా, ఇజ్రాయిల్ దాడుల్లో ఇరాన్ అధ్యక్షుడు ఖమేనీని హత్య చేసిన సంగతి తెలిసిందే. అమెరికా-ఇజ్రాయిల్-ఇరాన్‌ల మధ్య పెరుగుతున్న వైరుధ్యాలు సున్నితమైన ప్రాంతాన్ని తీవ్ర సంఘర్షణ వైపు నెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు కోటిమంది భారతీయులతో సహా కోట్లాది మంది ప్రజలు అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని అన్నారు. భద్రతాపరమైన ఆందోళనలు వాస్తవమే అయినప్పటికీ, సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించే దాడులు సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తాయి. ఇరాన్‌పై ఏకపక్ష దాడులు, అలాగే ఇతర మధ్యప్రాచ్య దేశాలపై ఇరాన్ దాడులను ఖండించాలి. ఘర్షణలు మరింత ఘర్షణలకు దారితీస్తాయి. చర్చలు మరియు సంయమనం శాంతికి ఏకైక మార్గం అని అన్నారు. భారతదేశం నైతికంగా స్పష్టంగా ఉండాలి. అంతర్జాతీయ చట్టం మరియు మానవుల ప్రాణాలను కాపాడుకోవడంలో మనం స్పష్టంగా మాట్లాడే ధైర్యం కలిగి ఉండాలి. మన విదేశాంగ విధానం సార్వభౌమాధికారం మరియు వివాదాల శాంతియుత పరిష్కారాన్ని సూచిస్తుంది. అది స్థిరంగా ఉండాలని అన్నారు. మధ్యప్రాచ్యం సంఘర్షణపై ప్రధాని మోడీ మాట్లాడాలని పునరుద్ఘాటించారు.

ఉత్తేజిత దినపత్రిక



# రూ.6 లక్షలలోపే కొత్త కారు..



మీరు నూతన సంవత్సరంలో బడ్జెట్ ధరలో మంచి కారు కొనుగోలు చేయాలను భావిస్తున్నారా? అయితే, మీకో మంచి ఆఫర్ అందుబాటులో ఉంది. కేవలం రూ.6 లక్ష లోపే కొత్త కారు కొనుగోలు చేయచ్చు. కంపెనీ ఇయర్ ఎండ్ ఆఫర్ కింద రూ.65 వేల వరకు డిస్కౌంట్ అందిస్తోంది. మరెందుకు ఆలస్యం ఇప్పుడే బుక్ చేసుకోండి..

మరి కొన్ని రోజుల్లో 2024 ప్రారంభం కానుంది. ఈ క్రమంలో కస్టమర్లను ఆకర్శించేందుకు కార్ల తయారీ కంపెనీలు ఇయర్ ఎండ్ ఆఫర్లు తీసుకొస్తున్నాయి. తమ వాహనాలపై భారీ తగ్గింపు ఇస్తూ స్టాక్‌ను ఖాళీ చేస్తున్నాయి. దేశీయ అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ సైతం కొన్ని మోడళ్లపై డిస్కౌంట్ ఆఫర్లు అందిస్తోంది. కంపెనీ తన హ్యాచ్‌బ్యాక్ మోడల్ ఇగ్నిస్‌పై భారీగా డిస్కౌంట్ ఇస్తోంది. కస్టమర్‌లు ఈ ఆఫర్‌ను ఎక్స్ఛేంజ్ బోనస్, క్యాష్ డిస్కౌంట్, కార్పొరేట్ డిస్కౌంట్ రూపంలో పొందవచ్చు. నూతన ఏడాదికి బడ్జెట్ ధరలో కారు కొనుగోలు చేయాలని భావిస్తున్న వారికి ఇది మంచి అవకాశంగా చెప్పుకోవచ్చు.

మారుతీ ఇగ్నిస్ కారుపై రూ.65,000 వరకు తగ్గింపు లభిస్తోంది. అందులో రూ.40,000 వరకు క్యాష్ డిస్కౌంట్ ఉండగా.. రూ.15,000 వరకు ఎక్స్ఛేంజ్ బోనస్, రూ.10,000 వరకు కార్పొరేట్ బోనస్ లభిస్తుంది. ఈ ప్రయోజనాలు డిసెంబర్ 31, 2023 వరకు చెల్లుబాటులో ఉంటాయి. అయితే డీలర్‌షిప్ ప్రాంతం, కారు రంగు, వేరియంట్, స్టాక్ లభ్యత, ఇతర అంశాలను బట్టి ఆఫర్లు మారే అవకాశం ఉంటుంది. మీ సమీప అధీకృత మారుతి సుజుకీ డీలర్‌షిప్‌ను సంప్రదించి ఆఫర్ వివరాలు తెలుసుకోవడం మంచింది. ఇగ్నిస్ దాని ఇంజిన్ గరిష్ఠంగా 83 %శక్తినీ, 113 గరిష్ఠ టార్క్‌ను ఉత్పత్తి చేయగలదు. ఈ కారులో 5- స్పీడ్ మ్యాన్యువల్, 5-స్పీడ్ ఆటోమేటిక్ గేర్‌బాక్స్ ఉంది. ఇగ్నిస్ ప్రీమియం, అప్‌డేట్ చేసిన ఇంటీరియర్‌ను కలిగివుంది. ఈ కారులో ఐదుగురు సులభంగా కూర్చోవచ్చు. స్మార్ట్ ప్లే స్టూడియో ఫీచర్‌తో కూడిన 7-అంగుళాల టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ ఉంది. కాల్స్, మ్యూజిక్, నావిగేషన్ వంటి సౌకర్యాలు ఇందులో ఉన్నాయి. ఆటోమేటిక్ క్లైమేట్ కంట్రోల్ కూడా కారులో ఉంది. ఈ కారులో కంపెనీ నెక్సా సేఫ్టీ షీల్డ్‌ను అందించింది. ఇగ్నిస్‌కు డ్యూయల్ ఫ్రంట్ ఎయిర్‌బ్యాగ్‌లు, తో కూడిన , వెనుక డోర్ చైల్డ్ లాక్, వెనుక పార్కింగ్ కెమెరా, చైల్డ్ సీట్ లాక్ యాంకర్ వంటి భద్రతా ఫీచర్లు ఉన్నాయి.

రూ.5.84 లక్షలే..

మారుతీ సుజుకీ తన నెక్సా ప్రీమియం డీలర్‌షిప్ ద్వారా ఇగ్నిస్‌ను విక్రయిస్తోంది. దీని ధర రూ. 5.84 లక్షలు (ఎక్స్-షోరూమ్) నుంచి ప్రారంభమవుతోంది. ఆపైన రూ.65 వేల వరకు డిస్కౌంట్ పొందే అవకాశం ఉంది. ఈ కారు టాప్ మోడల్ రూ.8.16 లక్షల (ఎక్స్-షోరూమ్) వరకు ఉంటుంది. భారతీయ మార్కెట్లో ఇది టాటా టియాగో, హ్యుందాయ్ ఐ10, టాటా పంచ్‌లకు పోటీగా ఉందని చెప్పవచ్చు.

# రైల్వే నుంచి రూ.1374 కోట్ల ఆర్డర్..




రైల్వే శాఖ నుంచి రూ.1,374 కోట్ల భారీ ఆర్డర్ అందుకున్న క్రమంలో ఓ ఇంజినీరంగ్ కంపెనీ స్టాక్ దూసుకెళ్తోంది. గురువారం ట్రేడింగ్‌లో 5 శాతం పెరిగి అప్పర్ సర్క్యూట్ తాకింది. ఇవాళ సైతం జోష్‌లో కొనసాగుతోంది. గత 2 ఏళ్ల కాలంలో చూస్తే ఏకంగా 511 శాతం లాభాలు అందించింది. ఆ స్టాక్ గురించి ఇప్పుడే తెలుసుకోండి మరి. ఇంజినీరింగ్ సెక్టార్‌కు చెందిన మల్టీ బ్యాగర్ స్టాక్ టెక్సా మాకో రైల్ అండ్ ఇంజినీరింగ్ లిమిటెడ్ అదరగొడుతోంది. ఈ కంపెనీ డిసెంబర్ 20న రైల్వే శాఖ నుంచి రూ. 1,347 కోట్లు భారీ ఆర్డర్ సొంతం చేసుకుంది. ఈ క్రమంలో ఆ కంపెనీ షేర్లు దూసుకెళ్తున్నాయి. గురువారం ట్రేడింగ్‌లో 5 శాతానికిపైగా పెరిగి అప్పర్ సర్క్యూట్ తాకింది. ఇవాళ శుక్రవారం డిసెంబర్ 22 రోజు ట్రేడింగ్ లోనూ మంచి జోష్‌లో కొనసాగుతోంది. ప్రస్తుతం రూ. 172.85 వద్ద కొనసాగుతోంది. ఇన్వెస్టర్లకు భారీ లాభాలు అందిస్తున్న ఈ స్టాక్ గురించి తెలుసుకుందాం. 2023, డిసెంబర్ 20 నాటి కంపెనీ బీఎస్ఈ ఫైలింగ్ ప్రకారం.. రైల్వే బోర్డు 3400 %దీూశచీూ% వ్యాగన్‌ల తయారీ సరఫరా కోసం కంపెనీకి ఆర్డర్ ఇచ్చింది. వీటిలో 1133 వ్యాగన్‌లలో మొదటి విడత 2024, డిసెంబర్ 31 నాటికి అందించాలి. రెండో విడతలో 2025, జూన్ 30 నాటికి 1133 వ్యాగన్‌లు అందించాలి. 2025, డిసెంబర్ 31 నాటికి 3వ విడత 1134 వ్యాగన్‌లు అందించాలి. . ఈ ఆర్డర్ విలువ సుమారు రూ. 1374.41 కోట్లు అని కంపెనీ తెలిపింది. 2023 సెప్టెంబర్ తో ముగిసిన రెండో త్రైమాసికంలో కంపెనీ ఏకీకృత నికర లాభం 70 శాతం వృద్ధి చెంది రూ. 20 కోట్లుగా నమోదు చేసింది.

కంపెనీ ఆదాయం 64 శాతం పెరిగి రూ. 805 కోట్లకు పెరిగింది. 2023 సెప్టెంబర్ తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ ఏకీకృత నికర లాభం 70 శాతం వృద్ధి చెంది రూ. 20 కోట్లకు చేరుకుంది. కంపెనీ ఏకీకృత మొత్తం ఆదాయం 64 శాతం పెరిగి రూ. 805 కోట్లకు పెరిగింది. సెగ్మెంట్ నుంచి దాని స్థూల ఆదాయం 3 రెట్లు పెరిగి రూ. 616 కోట్లకు చేరుకుంది. ఇది క్రితం సంవత్సరం రూ. 192 కోట్లుగా ఉంది. ఈ స్టాక్ 52 వారాల గరిష్ట ధర రూ. 188.95 గా ఉంది. 52 వారాల కనిష్ఠ ధర రూ. 40.49 గా ఉంది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.6,574.25 కోట్లుగా ఉంది. ఈ సంవత్సరం ఇప్పటి వరకు చూసుకంటే ఈ కంపెనీ షేర్లు 196 శాతం లాభపడ్డాయి. గత ఒక సంవత్సరంలో 209 శాతం పెరిగాయి. గత రెండు సంవత్సరాలలో 511 శాతం లాభపడ్డాయి. గత మూడు సంవత్సరాలలో 550 శాతం పెరిగింది. రెండేళ్ల క్రితం ఇందులో రూ.1 లక్ష పెట్టి షేర్లు కొనుగోలు చేసినట్లయితే ఇప్పుడు వాటి విలువ రూ.6 లక్షల పైన ఉంటుంది. అదే మూడేళ్ల క్రితం కొనుగోలు చేసినట్లయితే ఇప్పుడు రూ.6.50 లక్షల పైన విలువ ఉంటుంది.

# తగ్గిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర..

క్రిస్మస్ వేళ కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించినట్లు ప్రకటించాయి ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ. తగ్గించిన కొత్త రేట్లు డిసెంబర్ 22 నుంచే అమలులోకి వచ్చినట్లు తెలిపాయి. క్రిస్మస్ వేడుకలకు ప్రజలు సిద్ధమవుతున్న క్రమంలో కేంద్ర సర్కార్ శుభవార్త చెప్పింది. 19 కేజీల వాణిజ్య సిలిండర్ ధరలను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. నూతన సంవత్సరం, క్రిస్మస్ వేడుకల సందర్భంగా నాలుగు మెట్రో నగరాల్లో19 కిలోల కమర్షియల్ ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గిస్తున్నట్లు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు శుక్రవారం ప్రకటించా యి. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై నగరాల్లో ఒక్కో సిలిండర్ పై రూ.39.50 తగ్గిస్తున్నట్లు వెల్లడించాయి. తగ్గించిన కొత్త రేట్లు ఈ రోజు అంటే 2023, డిసెంబర్ 22 నుంచే అమలులోకి వచ్చినట్లు తెలిపాయి. ధరలు తగ్గిన తర్వాత దేశ రాజధాని ఢిల్లీలో 19 కిలోల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ. 1757.50కి దిగివచ్చింది. అయితే, 19 కిలోల కమర్షియల్ ఎల్‌పీజీ గ్యాస్ ధరలు తగ్గించినప్పటికీ డొమెస్టిక్ (గృహ వినియోగ సిలిండర్) ఎల్‌పీజీ సిలిండర్ ధరలను మాత్రం మార్చలేదు ఆయిల్ మార్కెటింగ్ సంస్థలు. ప్రస్తుతం గృహ వినియోగ సిలిండర్ ధరలు స్థిరంగానే కొనసాగుతు న్నాయి. సాధారణంగా కమర్షియల్, డొమెస్టిక్ ఎల్‌పీజీ సిలిండర్ ధరలకు సంబంధించి ప్రతి నెల మొదటి రోజున సమీక్షిస్తాయి చమురు సంస్థలు. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఇలా ధరలను మారుస్తుంటాయి.

# అర్జెంట్‌గా మనీ కావాలా?




మీకు అత్యవసరంగా డబ్బులు అవసరమయ్యాయా? క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉందా? అయినే నో టెన్షన్. మీరు మీ ఎల్ఐసీ పాలసీపై చాలా తక్కువ వడ్డీకే రుణం తీసుకోవచ్చు. మరి దీని అర్హతలు, ఎలా దరఖాస్తు చేసుకోవాలి? అనే వివరాలు తెలుసుకుందాం. అనుకోని సంఘటన జరిగినట్లు అత్యవసరంగా పెద్ద మొత్తంలో డబ్బులు అవసరమవుతాయి. అప్పుడు ఏం చేయాలో తోచదు. బ్యాంకులో రుణం తీసుకోవడం అంటే కాస్త సమయం తీసుకుంటుంది. వడ్డీ రేట్లు సైతం ఎక్కువగానే ఉంటాయి. క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉన్న వారికి బ్యాంకులు లోన్ ఇచ్చేందుకు ఇష్టపడవు. అలాంటి వారి కోసం ఓ మంచి అవకాశం ఉంది. చాలా తక్కువ వడ్డీకే, క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉన్నా లోన్ పొందే సులభమైన మార్గం. అదే ఎల్ఐసీ పాలసీ పై లోన్ తీసుకోవడం. మీ వద్ద ఎల్ఐసీ పాలసీ ఉంటే చాలా వేగంగా తక్కువ వడ్డీకే లోన్ పొందే అవకాశం ఉంది. ఆ వివరాలు ఇప్పుడు మనం తెలుసుకుందాం. భారతీయ జీవిత బీమా సంస్థలో పాలసీ కలిగిన వారు ఈజీగా లోన్ తీసుకొచ్చు. పాలసీ స్వాధీన విలువలో 90 శాతం వరకు రుణంగా ఇస్తుంది ఎల్ఐసీ. అయితే, ఎల్ఐసీ ఎండోమెంట్ పాలసీదారులకు మాత్రమే ఈ లోన్ పొందే అర్హత ఉంటుంది. ఆరు నెలలకోసారి వడ్డీ చెల్లిస్తూ పాలసీ గడువు ముగిసే వరకు అసలు చెల్లించకుండా లోన్ కొనసాగించే వెసులుబాటు ఉంది. మెచ్యూరిటీ తర్వాత వచ్చే మొత్తం నుంచి ఎల్ఐసీ లోన్ మొత్తాన్ని మినహాయించుకుంటుంది. లేదా పాలసీదారుడు మరణిస్తే పరిహారం నుంచి ఆ మేరకు తగ్గించుకుంటుంది. ఒక వేళ వడ్డీ కూడా చెల్లించకుంటే, పాలసీని ముందే టెర్మినేట్ చేసే హక్కు ఎల్ఐసీకి ఉంటుందని గుర్తుంచుకోవాలి.

అర్హతలు ఇవే.. ఎల్ఐసీ నుంచి లోన్ తీసుకోవాలంటే పాలసీ తీసుకుని కనీసం 3 సంవత్సరాలు నిండి ఉండాలి. మీ ఇన్సూరెన్స్ పాలసీకి సరెండర్ వ్యాల్యూ ఉండాలి. పాలసీ బాండ్?ను ఎల్ఐసీకి ఇవ్వాలి. ఇంకా అర్హత ఉంటే అదే పాలసీపై రెండో రుణం కూడా తీసుకునేందుకు వీలుంది. ఎల్ఐసీ కాకుండా ఇతర ఆర్థిక సంస్థల నుంచి సైతం మీ పాలసీపై లోన్ తీసుకోవచ్చు. కాకపోతే ఎల్ఐసీ సరెండర్ విలువపై 90 శాతం వరకు లోన్ ఇస్తే ఇతర సంస్థలు ఇంత కంటే తక్కువ మొత్తం ఇస్తాయి.ఆన్లైన్ లేదా ఆఫ్లైన్లలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎల్ఐసీ వెబ్సైట్లో ఆన్లైన్ సర్వీసెస్ సెక్షన్‌లో ఆన్లైన్ లోన్ ఆప్షన్ ఎంచుకోవాలి. ఆ తర్వాత రిక్వెస్ట్ ఫర్ ద లోన్ ఆప్షన్ కనిపిస్తుంది. కొత్తగా రుణం తీసుకోవాలనుకునే వారి కోసం మరో ఆప్షన్ కూడా ఉంటుంది. పాలసీదారుడి బ్యాంకు ఖాతాలో లోన్ మొత్తం జమ అవుతుంది. అందుకే దీనికంటే ముందు ఎల్ఐసీకి ఇచ్చిన బ్యాంకు అకౌంట్ వివరాలు సరిగా ఉన్నాయో లేదో చూసుకోవాలి. మీ ఏజెంటు ద్వారా కూడా ఎల్ఐసీ పాలసీపై లోన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. లేదంటే నేరుగా ఎల్ఐసీ ప్రాంతీయ కార్యాలయానికి వెళ్లి అప్లై చేసుకోవచ్చు. ఏ విధానంలో దరఖాస్తు చేసినా, రుణం మాత్రం మీ బ్యాంకు అకౌంట్?లోనే జమ చేస్తారు. మీరు లోన్ను బ్యాంకు ద్వారా చెల్లించవచ్చు. లేదా ఎల్ఐసీ కార్యాలయానికి నేరుగా వెళ్లి అయినా చెల్లించవచ్చు. అత్యవసర సమయాల్లో వేగంగా రుణం పొందొచ్చు. పర్సనల్ లోన్ కంటే వడ్డీ రేటు చాలా తక్కువ. క్రెడిట్ స్కోర్‌తో అవసరం లేదు. ఏ ఇతర అర్హత పత్రాలను ఇవ్వాల్సిన పనిలేదు. అలాగే పాలసీదారుడు అకాల మరణం చెందితే, పాలసీ బెనిఫిట్స్ను కుటుంబానికి అందజేస్తారు.

# యూనివర్సిటీలో కాల్పులకు తెగబడిన విద్యార్థి..



తండ్రితో గొడవపడి.. అతడ్ని కాల్చి చంపిన ఓ విద్యార్థి.. అటు నుంచి నేరుగా తాను చదువుకుంటోన్న యూనివర్సిటీకి వచ్చాడు. అతడు తొలుత ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతోనే అక్కడకు చేరుకుని.. చివరకు మరో దారుణానికి ఒడిగట్టాడు. తోటి విద్యార్థులపై విచక్షణారహి తంగా కాల్పులు జరిపాడు. అత్యంత ఘోరమైన ఈ ఘటన ఐరోపా దేశం చెక్ రిపబ్లిక్ రాజధాని ప్రేగ్ నగరంలో చోటుచేసుకుంది. ఆ దేశ చరిత్రలోనే తొలిసారి ఇంతటి దారుణం జరగడం గమనార్హం. మధ్య ఐరోపా దేశం చెక్ రిపబ్లిక్‌లో గురువారం దారుణమైన ఘటన చోటుచేసుకుంది. రాజధాని ప్రేగ్ నగరంలోని చార్లెస్ యూనివర్సిటీలో ఓ విద్యార్థి కాల్పులకు తెగ బడ్డాడు. ఈ ఘటనలో కనీసం 15 మంది మృతి చెందగా... మరో 30 మంది వరకూ గాయప డ్డారు. కాల్పుల సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడ్ని హతమార్చారు. యూనివర్సిటీలోని ఆర్ట్స్ కాలేజీలోని ఫిలాసఫీ డిపార్ట్‌మెంట్ వద్ద ఈ దారుణానికి పాల్పడ్డాడు. నిందిత విద్యార్థి తొలుత తన తండ్రిని చంపి ఆపై యూనివర్సిటీకి వచ్చి కాల్పులకు తెగబడ్డట్టు సమాచారం.

తండ్రి హత్యలో నిందితుడి కోసం పోలీసుల గాలింపు చేపట్టిన తరుణంలోనే ప్రేగ్ నగరానికి చేరుకుని ఈ దారుణానికి పాల్పడినట్టు పోలీస్ చీఫ్ మార్టిన్ వాండ్రసెక్ తెలిపారు. ఆత్మహత్య చేసుకోడానికి నిందితుడు ప్రేగ్‌కు వస్తున్నట్టు తెలుసుకుని.. అతడి కోసం ఛార్లెస్ యూనివర్సిటీ ఫిలాసఫీ విభాగం భవంతిలో పోలీసులు గాలిస్తుండగా మరో భవనంలోకి వెళ్లాడు. కాగా, గతంలో రష్యాలో జరిగిన ఇటువంటి ఘటనను స్ఫూర్తిగా తీసుకుని నిందితుడు ఈ దారుణానికి పాల్పడ్డాడని పోలీసులు పేర్కొన్నారు.

ఈ ఘటనపై చెక్ రిపబ్లిక్ అధ్యక్షుడు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. బాధిత కుటుంబాలకు తన సంతాపం తెలియజేశారు. ఈ ఘటనపై ఇతర ఐరోపా దేశాధినేతలు విచారం వ్యక్తం చేశారు. 1993లో స్వతంత్ర దేశంగా చెక్ అవతరించిన తరువాత మొదటిసారి జరిగిన అత్యంత దారుణమైన కాల్పుల ఘటన ఇదే. దీంతో యావత్ దేశం షాక్‌లో కూరుకుపోయింది. చెక్ హోమ్ మంత్రి విట్ రక్సున్ మాట్లాడుతూ... ఘటనలో వేర్పాటువాద లేదా తీవ్రవాద కోణం లేదన్నారు. నిందితుడు తన స్వస్థలం హోస్టన్‌లో గురువారం ఉదయం తండ్రి చంపి.. రాజధానికి ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతో వచ్చాడని అన్నారు. తరువాత అతడి ఇంటిలో చేసిన తనిఖీల్లో ప్రేగ్‌లో డిసెంబరు 15న మరొక వ్యక్తి, అతడి 2 నెలల కుమార్తెను హత్య చేసినట్టు ఆధారాలు బయటపడ్డాయి. అయితే, విద్యార్థికి గతంలో ఎటువంటి క్రిమినల్ రికార్డు లేదని అధికారులు చెప్పారు. ముష్కరుడి ఒంటిపై తీవ్ర గాయాలున్నాయని, అయితే అతడు తనను తాను చంపుకున్నాడా లేదా పోలీసులు జరిపిన కాల్పుల్లో కాల్చి చంపబడ్డాడా అనేది స్పష్టంగా తెలియరా లేదని పేర్కొన్నారు. దుండుగుడి కాల్పుల నుంచి తప్పించుకోడానికి పలువురు విద్యార్థులు భవంతిపై నుంచి దూకి ప్రాణాలు కాపాడుకు న్నారు. ఈ క్రమంలో వారికి గాయాలైనట్టు అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

# పూంఛ్ దాడికి ముందు ఉగ్రవాదుల రెక్కీ..



జమ్మూ కాశ్మీర్‌లో సైన్యంపై ఉగ్రవాదులు జరిపిన కాల్పులు ముందస్తు ప్రణాళిక ప్రకారమే జరిగినట్లు అధికారులు చెబుతు న్నారు. ఈ ఘటనపై విచారణ జరుపుతున్న అధికారులకు సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. సైనికుల వాహనాలు వెళ్తాయని తెలిసి.. ఆ ప్రాంతంలో ముందు గానే ఉగ్రవాదులు రెక్కీ నిర్వహిం చినట్లు సైనిక ఉన్నతాధికారులు గుర్తించారు. నెల రోజుల వ్యవధిలోనే ముష్కరులు రెండుసార్లు దాడులకు దిగడం తీవ్ర కలకలం రేపుతోంది. జమ్మూ కాశ్మీర్‌లో సైనికులు వెళ్తున్న వాహనాలపై గురువారం ఉగ్రవాదులు కాల్పు లకు తెగబడిన ఘటన యావత్ దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ ఘటనలో ఐదుగురు జవాన్లు అమరులు అయ్యారు. గత నెల రోజుల వ్యవధిలోనే రెండోసారి ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం తీవ్ర సంచలనంగా మారింది. అయితే ఈ దాడికి పాల్పడేందుకు ముష్కరులు పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకున్న ట్లు తెలుస్తోంది. ముందుగా ఆ ప్రాంతంలో రెక్కీ నిర్వహించి.. ఆ తర్వాత మూల మలుపు వద్ద కొండల్లో దాక్కొని దాడులు చేసినట్లు భద్రతా అధికారులు గుర్తించారు. ఈ ఘటనపై ఇప్పటికే అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. గురువారం జమ్మూ కాశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో సైనికులను తరలిస్తున్న రెండు వాహనాలపై ఉగ్రవాదులు భీకర కాల్పులకు తెగబడ్డారు. అయితే అక్కడే కొండపై నుంచి ఉగ్రవాదులు కాల్పులు జరిపినట్లు అధికారులు వెల్లడించారు. అయితే దాడికి ముందు ఉగ్రవాదులు ఆ ప్రాంతంలో రెక్కీ నిర్వహించి నట్లు తెలుస్తోంది. పూంఛ్ జిల్లాలోని ధేరా కి గాలి, బుఫ్లియాజ్ మధ్య గల ధత్యార్ మోర్ వద్ద గురువారం మధ్యాహ్నం 3.45 గంటలకు సైనికులపై ఉగ్రవాదులు దాడి చేశారు. సైనిక వాహనాలపై బుల్లెట్ల వర్షం కురిపించారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా బలగాలు ఎదురు కాల్పులు జరపగా.. అప్పటికే వారు అక్కడి నుంచి పారిపోయినట్లు సైనిక ఉన్నతాధికారులు గుర్తించారు. అయితే ఉగ్రవాదులు చేసిన దాడిలో ఐదుగురు సైనికులు అమరులయ్యారు. అయితే ధేరా కి గాలి, బుఫ్లియాజ్ మార్గంలో ప్రమాదకరమైన మూలమలుపు ఒకటి ఉంది. దీంతో అక్కడే సైనిక వాహనాలపై దాడి చేయాలని ఉగ్రవాదులు నిర్ణయించుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. అందుకే ఆ ప్రాంతంలో ఉన్న కొండల్లో ముందుగానే నక్కి ఉన్న ముష్కరులు.. ఆ ప్రమాదకరమైన మూల మలుపు వద్ద సైనిక వాహనాలు నెమ్మదిగా ప్రయాణించగానే కాల్పులకు దిగారు. వాహనాలు స్లోగా వెళ్తున్నప్పుడు సులువుగా దాడి చేయవచ్చని.. ముష్కరులు ఆ ప్రాంతాన్ని ఎంచుకున్నట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ దాడి కోసం ఉగ్రవాదులు ముందుగానే రెక్కీ చేసినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ధేరా కి గాలి ప్రాంతంలో ఓ ఆపరేషన్ కోసం సైనికులను తరలిస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ముగ్గురు లేదా నలుగురు ఉగ్రవా దులు కొండల్లో నక్కి ఉండి కాల్పులకు పాల్పడినట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దాడి జరిగిన ప్రాంతంలో భద్రతా సిబ్బంది కార్డన్ సెర్చ్ చేపట్టి అనువణువూ గాలిస్తున్నారు. డాగ్ స్క్వాడ్‌లతో పాటు డ్రోన్లను ఉపయోగించి గాలింపు ఆపరేషన్ చేపట్టారు. అవసరమైతే అదనపు భద్రతా సిబ్బందిని మోహరించి ముష్కరులను పట్టుకుంటామని ఆర్మీ అధికారులు ప్రకటించారు.ఈ దాడికి బాధ్యత తమదే అని పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా అనుబంధ సంస్థ అయిన పీపుల్స్ యాంటీ ఫాసిస్ట్ ఫ్రంట్ ఇప్పటికే ప్రకటించుకుంది. మరోవైపు.. సైనికులపై ఉగ్రవాదులు కాల్పులు చేయడం నెల రోజుల వ్యవధిలో ఇది రెండోసారి కావడం పెను సంచలనంగా మారింది. గత నెల రాజౌరీ జిల్లాలో ఉగ్రవాదులు ఇలాగే గుహల్లో నక్కి భద్రతా బలగాలపై కాల్పులు జరిపారు. ఆ ఘటనలో ఇద్దరు యువ కెప్టెన్లు, ముగ్గురు జవాన్లు అమరులయ్యారు.

# లారీ డ్రైవర్లకు ఉచితంగా టీ

శివరామచారి రాత్రి పూట హైవేలపై లారీలు వెళ్తూ ఉంటాయి. లారీ డ్రైవర్లు నిద్ర లేకుండా వందల కిలోమీటర్లు డ్రైవింగ్ చేస్తూనే ఉంటారు. ఈ క్రమంలోనే ప్రమాదాలు సంభవిస్తూ ఉంటాయి. దీంతో రాత్రి పూట రోడ్ యాక్సిడెంట్‌లను నివారించేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. లారీ డ్రైవర్లకు ఉచితంగా టీలు సరఫరా చేయాలని నిర్ణయించింది. వేడి వేడి టీ తాగడం వల్ల నిద్ర మత్తు వదిలి ప్రమాదాలు జరగ కుండా ఉంటాయని భావిస్తోంది. అతి వేగం, నిద్రమత్తు కారణంగానే రాత్రి పూట చాలా ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. నిరంత రాయంగా లారీ డ్రైవర్లు వందల కిలోమీటర్లు ప్రయాణించడం వల్ల అలసటతో నిద్రమత్తు వచ్చి ప్రమాదాలకు కారణం అవుతూ ఉంటాయి. అయితే ఇలాంటి ప్రమాదాలు అర్ధరాత్రులు చోటు చేసుకోకుండా ఒడిశా ప్రభుత్వం కొత్త ప్రయత్నానికి తెర తీసింది.



రాత్రి పూట హైవేలపై ప్రయాణించే లారీ డ్రైవర్లకు నిద్రమత్తు వదిలేలా వేడి వేడి టీని ఉచితంగా అందించాలని నిర్ణయించింది. ఈ క్రమంలోనే హైవేలపై ఉన్న దాబాల్లో లారీ డ్రైవర్లకు ఉచితంగా ఛాయ్ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. హైవేల పక్కన ఉన్న దాబాలు, హోటళ్లలో లారీ డ్రైవర్లకు ఉచితంగా టీ అందించాలని ఒడిశా ప్రభుత్వం సూచించింది. ఈ కార్యక్రమం అమలులో భాగంగా ముందుగా రోజూ రాత్రి 3 గంటల నుంచి తెల్లవారుజామున 6 గంటల వరకు ఫ్రీ ఛాయ్ ఇవ్వనున్నట్లు చెప్పింది. అయితే ఈ పూర్తి ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని ఒడిశా రవాణా శాఖ మంత్రి టుకుని సాహు గురువారం వెల్లడించారు. రహదారులపై తరచూ జరుగుతున్న ప్రమాదాల్లో ఎంతోమంది చనిపోతున్నారని.. ఈ పరిస్థితిని నియంత్రించాలని సీఎం నవీన్ పట్నాయక్ ఆదేశాలు జారీ చేశారని మంత్రి టుకుని సాహు చెప్పారు. హెల్మెట్‌లు లేకుండా బైక్‌లు నడపకూడదని ఇప్పటికే ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నట్లు వివరించారు.




మరోవైపు.. సరకు రవాణా వాహనాలు నడుపుతున్న డ్రైవర్లు రాత్రిళ్లు నిద్రలేమితో ఉంటారని.. అలాంటి వారికి హైవేలపై ఉండే దాబాలు, హోటళ్లలో ఫ్రీ టీ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు.

టీ తాగిన తర్వాత లారీ డ్రైవర్లు కొద్దిసేపు రెస్ట్ తీసుకునేలా హైవేల పక్కన కొన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఒడిశా ప్రభుత్వ అధికారులు తెలిపారు. దీంతోపాటు ఒడిశాలోని 30 జిల్లాల్లో లారీ టెర్మినల్స్ నిర్మిస్తున్నామని.. అందులో లారీ డ్రైవర్లకు అన్ని రకాల సౌకర్యాలు ఉంటాయని పేర్కొన్నారు. డ్రైవర్లు నిద్రపోవడానికి, స్నానాలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

# నీలిషికారి కాలనీలో సమగ్ర అభివృద్ధి చర్యలు - నాటుసారా రహిత నంద్యాల కోసం కలెక్టర్ ఆదేశాలు..

003



ఉత్తేజిత ప్రతినిధి. నందికొట్కూరు. మార్చ్.శ3
నాటుసారా నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న "నవోదయం--2.0" కార్యక్రమం ద్వారా నంద్యాల జిల్లా ఇప్పటికే నాటుసారా రహితంగా ప్రకటించబడింది. ఈ విజయాన్ని స్థిరంగా కొనసాగిస్తూ ప్రజల ఆరోగ్య భద్రతను పరిరక్షించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోంది.
ఈ నేపథ్యంలో 02.03.2026న జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గనియా జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం నందికొట్కూరు నీలిషికారి కాలనీ ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడారు. కాలనీలోని షికారి వెంకటేష్, షికారి దిబ్బలమ్మలు మాట్లాడుతూ తమ కులానికి చెందిన వారిపై పాఠశాలలు, సమాజంలో వివక్షత జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో సుమారు 350 కుటుంబాలు నివసిస్తున్నాయని, వీరిలో 9 మంది డిగ్రీ వరకు, పలువురు ఇంటర్ వరకు చదువుకున్నప్పటికీ తగిన ఉపాధి అవకాశాలు లేవని తెలిపారు. రుణాలు మంజూరు చేసినా తిరిగి చెల్లించే ఆర్థిక స్థితి లేదని పేర్కొన్నారు.
దీనిపై స్పందించిన కలెక్టర్ కుటుంబ వారీగా సమగ్ర సర్వే నిర్వహించి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. చదువుకున్న యువతను గుర్తించి వారికి తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. మహిళలకు కొత్తగా పొదుపు సంఘాలు ఏర్పాటు చేసి ఆర్థికంగా స్వావలంబన సాధించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.
అలాగే కాలనీలోని పాఠశాలలను సందర్శించి అవసరమైన వసతులపై నివేదిక ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. పిల్లలను వయస్సు వారీగా గుర్తించి అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో చేర్పించి వారికి అవసరమైన సదుపాయాలు కల్పించే కార్యక్రమం చేపట్టాలని తెలిపారు.
జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎస్. రవికుమార్ ఆదేశాల మేరకు నందికొట్కూరు ఎక్సైజ్ ఎస్ఐలు జాఫరుల్లా, భాష్యం శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిబ్బంది కృపావర కుమారి, మధుప్రసాద్, సుధీర్ కుమార్, రామిజాబి కలిసి నీలిషికారి కాలనీలో ఇంటింటి సర్వే ప్రారంభించారు.
నాటుసారా రహిత నంద్యాల లక్ష్యాన్ని స్థిరంగా నిలబెట్టడంతో పాటు కాలనీ సమగ్ర అభివృద్ధికి జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని అధికారులు పేర్కొన్నారు.

## సబ్సిడీ లో స్పేర్ పంపులు పంపిణి చేసిన రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్

**దేవనకొండ మార్చి 3 ( ఉత్తేజిత )**

మండల పరిధిలో చెల్లచెలిమల గ్రామంలో అక్షిత చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో రైతులకు 50% సబ్సిడీతో స్పేర్ పంపులను పంపిణి చేసిన రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ళ బొజ్జమ్మ అసలు రేటు 14000 రూపాయలు అయితే అక్షిత చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 50% సబ్సిడీతో 7 వేలు రూపాయలకే రైతులకు ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి అక్షిత చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అంజి స్వామి, గ్రామ సర్పంచ్ రామప్ప, వెంకటేష్,టీడీపీ నాయకులు గ్రామ ప్రజలు రైతులు పాల్గొన్నారు.



## మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరంప్రసాద్ రెడ్డి వేడుకలు ఘనంగా





**ముఖ్య అతిథులుగా, ఎమ్మెల్యే**

**మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి**

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూర్ మార్చి 3 :**

నందికొట్కూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద రెడ్డి మరియు వైస్ చైర్మన్ సుధాకర్ జన్మదిన సందర్భంగా నందికొట్కూరు మార్కెట్ యార్డ్ నందు నందికొట్కూరు నియోజవర్గ ఎమ్మెల్యే గిత్త జయ సూర్య, టిడిపి సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. టిడిపి నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి,కేక్ కట్ చేసి మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రసాద్ రెడ్డి ని , వైస్ చైర్మన్ సుధాకర్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, రమేష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, మహేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసులు, సుధాకర్ రెడ్డి, శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# తడిసి మోపెడు అవుతున్న యుద్ధం ఖర్చు

అమెరికా నెత్తిన భారీగా భారం పడడం ఖాయం
ఇప్పటికే 7వేల కోట్లు ఖర్చయినట్లు అంచనాలు
వాషింగ్టన్:'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' మొదలైన తర్వాత తొలి 24 గంటల్లో అగ్రరాజ్యం దాదాపు 779 మిలియన్ డాలర్లను అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.7వేల కోట్లు ఖర్చు చేసినట్లు అంచనాలు వెలువడుతున్నాయి. ఇదికాకుండా.. దాడులకు ముందే పలు యుద్ధ విమానాలు, నౌకలు, సైనిక బలగాలను అమెరికా పశ్చిమాసియాలో మోహరించింది. ఇందుకోసం అదనంగా మరో 630 మిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.5,700 కోట్లకు పైమాటే వెచ్చించి ఉండొచ్చని రక్షణరంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులు చేపట్టాయి. ఇప్పటివరకు వందల సంఖ్యలో లక్ష్యాలపై దాడులు చేశామని, టెహ్రాన్‌కు చెందిన 11 నౌకలను ధ్వంసం చేశామని యూఎస్ మిలిటరీ వెల్లడించింది. గగనతల, భూతల, సముద్ర దాడుల కోసం దాదాపు 20కి పైగా ఆయుధ వ్యవస్థలను అమెరికా వినియోగిస్తోంది. అయితే, ప్రస్తుతం దాడులు కొనసాగుతున్నందున.. ఈ ఘర్షణలకు అమెరికా వెచ్చించే ఖర్చెంతో ఇప్పుడే అంచనాకు రావడం కష్టమే.
ప్రస్తుతం అమెరికా-ఇజ్రాయెల్ దళాల వద్ద ఈ వ్యవస్థలు పరిమిత సంఖ్యలోనే ఉన్నాయి. అగ్రరాజ్యం కొన్నింటిని ఉక్రెయిన్‌కు పంపించింది. మరికొన్ని ఆసియా, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో మోహరించాయి. అందువల్ల ఆయుధ వ్యవస్థలను నష్టపోవడం ఆందోళనకరమే' అని అమెరికా మేధో సంస్థ స్టిమ్సన్ సెంటర్‌లో పనిచేసే సీనియర్ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా.. 2023 అక్టోబరు 7న జరిగిన
హమాస్ దాడి తర్వాత నుంచి ఇజ్రాయెల్‌కు అమెరికా 21.7 బిలియన్ డాలర్ల విలువైన సైనిక సాయాన్ని అందించినట్లు బ్రౌన్ యూనివర్సిటీ అధ్యయనం వెల్లడించింది. ఇది కాకుండా.. యెమెన్, ఇరాన్, పశ్చిమాసియాలో ఇజ్రాయెల్‌కు మద్దతుగా అమెరికా సాగిస్తోన్న ఆపరేషన్ల కోసం మరో 9.65 బిలియన్ డాలర్ల నుంచి 12.07 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తోంది. ఇవన్నీ కలిపి చూస్తే.. రెండేళ్లకు పైగా పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల అమెరికాకు ఇప్పటివరకు అయిన ఖర్చు 31.35 బిలియన్ డాలర్ల నుంచి 33.77 బిలియన్ డాలర్ల అంటే దాదాపు రూ.3.1 లక్షల కోట్లకు పైమాటే. ఇప్పుడు ఇరాన్ ఘర్షణలు మరింతకాలం కొనసాగితే.. ఈ ఆర్థిక భారం మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.సెంటర్ ఫర్ న్యూ అమెరికన్ సెక్యూరిటీ గణాంకాల ప్రకారం.. యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ వంటి యుద్ధ విమాన వాహకనౌకను నిర్వహించాలంటే రోజుకు 6.5 మిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.59 కోట్లు చొప్పున ఖర్చవుతుందట. అమెరికా-ఇరాన్ మధ్య సుదీర్ఘకాలంగా ఉన్న శత్రుత్వం గతవారం నుంచి మరింత ముదిరింది. ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై అగ్రరాజ్యం విరుచుకుపడటంతో పశ్చిమాసియా లో యుద్ధ జ్వాలలు చెలరేగాయి. ఈ ఉద్రిక్తతలు నానాటికీ మరింత తీవ్రంగా మారుతుండటం ఆందోళన
కలిగిస్తోంది. ఇరాన్‌పై యుద్ధం నాలుగైదు వారాలు కొనసాగొచ్చు అని స్వయంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అంటే సుదీర్ఘ కాల ఘర్షణలకు వాషింగ్టన్ సిద్ధమవుతోందా? అలాగైతే ఈ యుద్ధం వల్ల అమెరికాపై పడే భారమెంత అన్న భయాలు కలుగుతున్నాయి. ఇవిగాక, యుద్ధంలో ధ్వంసమైన ఆయుధ పరికరాల నష్టం అదనపు భారమే. ఈ ఘర్షణల సమయంలో కువైట్‌లో అమెరికాకు చెందిన మూడు యుద్ధ విమానాలు కూలిపోయాయి. ఫ్రెండ్లీ ఫైర్ లో భాగంగానే అవి కూలినట్లు అగ్రరాజ్యం చెబుతున్నా.. ఆర్థిక స్థిరత్వం, సాంకేతికతపరంగా ఇది ఆందోళనకర అంశమే. ఖర్చు పరంగా చూస్తే అమెరికాకు పెద్ద విషయం కాకపోవచ్చు. ఎందుకంటే అగ్రరాజ్య రక్షణ బ్జడెట్ ప్రస్తుతం ట్రిలియన్ డాలర్ల పైనే ఉంది. ఇప్పుడు దానిని 1.5 ట్రిలియన్ డాలర్ల వరకూ పెంచే అవకాశం ఉంది. కానీ, సమస్య ఏంటంటే ఘర్షణల్లో అమెరికా ఆయుధాలను కోల్పోవడమే.

# హర్మూజ్ జలసంధి మూతతో ఆయిల్ తిప్పలు !

పిల్లికి చెలగాలటం..ఎలుకకు ప్రాణసంకటం అన్నది సామెత. ఇప్పుడు అమెరికా, ఇజ్రాయిల్ చెలగాటంతో భారత్ సహా అనేక ప్రపంచ దేశాలకు ప్రాణసంకటంగా మారనుంది. ప్రధానంగా ఇంధన రవాణా బంద్ అయితే తట్టుకోవడం కష్టమే. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ దాడులు మధ్యప్రాచ్యాన్ని ఉద్రిక్తతల్లోకి నెట్టాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ మరణం తర్వాత ఆందోళనలు తారాస్థాయికి చేరాయి. ఈ యుద్ధం కేవలం రెండు దేశాలకు మాత్రమే పరిమితం కాకుండా, గల్ఫ్ లోని యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, ఖతార్, బహ్రెయిన్ వంటి దేశాలకు కూడా విస్తరించింది. ఇరాన్ ఈ దేశాల్లోని అమెరికన్ స్థావరాలపై మిస్సైల్స్, డ్రోన్లలో దాడులకు తెగబడుతోంది. దుబాయ్, దోహా,అబుదాబీ వంటి సిటీలపై దాడులు చేస్తోంది. ఇకపోతే హార్మూజ్ జలసంధి మూసివేత, చమురు రవాణాకు ఇబ్బందులు ఏర్పడనున్నాయి.
ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. ఇది భారత్‌తో పాటు ఇతర ఆసియా దేశాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. గల్ఫ్ నుంచి వచ్చే చమురు ఈ మార్గం ద్వారానే రావాల్సి ఉంటుంది. ప్రపంచంలోని రోజువారీ చమురు వినియోగంలో 20 శాతం ఈ హార్మూజ్ జలసంధి నుంచే ప్రయాణిస్తుంటుంది.ఈ మార్గం గుండా వచ్చే చమురు ఎగుమతుల్లో 82 శాతం ఆసియాకు వెళ్తున్నాయి. ఇందులో భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియా వాటా ఏకంగా 67 శాతం ఉంది. భారత్ ముడి చమురులో 90 శాతం చమురును మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. ఇందులో 40 శాతం హార్మూజ్ జలసంధి నుంచే వస్తున్నాయి. ఇరాక్ పై అమెరికా ఇజ్రాయిల్ దళాలు దాడుల నేపథ్యంలో హార్మూజ్ జలసంధి ద్వారా ఇంధన సరఫరా అంతరాయం కలిగే అవకాశంపై ఆందోళనలు వ్యక్తమవు తున్నాయి. ఈ మార్గంలో ఏ విధమైన సంక్షోభం తలెత్తినా భారతదేశ ఆర్థిక వ్యవస్థ, ఇంధన భద్రతపై తీవ్ర ప్రభావం పడే అవకాశముందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. భారతదేశం దిగుమతి చేసుకునే ముడి చమురులో 50 శాతానికి పైగా హార్మూజ్ జలసంధి ద్వారానే వస్తుంది. ఇది ముఖ్యంగా సౌదీ అరేబియా, ఇరాక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్, ఖతార్ నుంచి సరఫరా అవుతోంది. అదనంగా, భారతదేశ ఎల్ఎన్జీ దిగుమతుల్లో దాదాపు 60 శాతం, అలాగే ఎల్పిజి లో పెద్ద భాగం కూడా ఇదే మార్గం ద్వారా రవాణా అవుతోంది. ప్రపంచ వాణిజ్యాన్ని పర్యవేక్షించే సంస్థ 'కెప్లర్' గణాంకాల ప్రకారం, ఫిబ్రవరి 24 నాటికి రోజుకు సుమారు 2.6 మిలియన్ బ్యారెల్ల చమురు హార్మూజ్ మార్గం ద్వారా భారతదేశానికి చేరింది. ప్రపంచ చమురు వాణిజ్యంలో సుమారు 20 శాతం, ఎల్ఎన్జీ వాణిజ్యంలో 30 శాతానికి పైగా ఈ జలసంధి ద్వారానే జరుగుతున్నందున, ఇక్కడి సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపే ప్రమాదం ఉంది. అమెరికా దాడుల ముప్పు నేపథ్యంలో శుక్రవారం ప్రపంచ చమురు ధరలు బ్యారెల్‌కు 72.87 డాలర్లకు పెరిగాయి. ఒకే రోజులో 6 డాలర్ల పెరుగుదల నమోదైంది. బ్యారెల్‌కు రూ.10 పెరుగుదల చోటుచేసుకుంటే, భారతదేశం దిగుమతులపై సుమారు 140 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.1.27 లక్షల కోట్లు అదనంగా చెల్లించాల్సి వస్తుందని అంచనా. ఇప్పటికే దేశంలో ఇంధనం, వంటగ్యాస్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. హార్మూజ్ జలసంధిలో అంతరాయం ఏర్పడితే భారతదేశానికి గట్టి దెబ్బ అవుతుందని 'కెప్లర్' హెచ్చరించింది. దేశానికి అవసరమైన ముడి చమురులో దాదాపు 90 శాతం దిగుమతులపైనే ఆధారపడుతున్న నేపథ్యంలో, సరఫరా భద్రత కీలకంగా మారింది. రష్యన్ చమురు దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు కూడా ఇంధన భద్రతపై ప్రభావం చూపవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరి చెప్పిన వివరాల ప్రకారం, ఏదైనా సంక్షోభం తలెత్తితే భారత్ వద్ద 74 రోజులకు సరిపడా చమురు నిల్వలు ఉన్నాయి. అయితే, మొత్తం పెట్రోలియం నిల్వల్ని 90 రోజులకు పెంచాలని కేంద్రం భావిస్తోంది. ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లోని భూగర్భంలోని గుహల్లో భద్రపరిచిన స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్ సుమారుగా 9.5 రోజులకు సరిపోతుంది. దీనికి తోడు చమురు మార్కెటింగ్ కంపెనీల వద్ద అందుబాటులో ఉన్న ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం సుమారుగా 67 రోజులకు సరిపడా ఉంది. ఒక బారెల్ ధర ఒక డాలర్ పెరిగితే భారత్ ఏడాదికి 1.4 బిలియన్ డాలర్లు అదనపు ఖర్చు భరించాల్సి వస్తుంది. దీనికి తోడు గ్యాస్ ధరలు కూడా పెరుగుతాయి. భారత్ తన అవసరాలకు అవసరమైన గ్యాస్‌లో 50 శాతం దిగుమతులపైనే ఆధారపడి ఉంది. ప్రస్తుతం, హార్మూజ్ జలసంధి మూతపడినా, రష్యన్ ఆయిల్ భారత్‌కు అందుబాటులో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. దీనితోడు వెనిజులా ఆయిల్ కూడా భారత్ కొనుగోలు చేస్తోంది. ఇప్పటికప్పుడు భారత్‌కు వచ్చే ఇబ్బందులు లేవు, కానీ దీర్ఘకాలం హార్మూజ్ జలసంధి మూతపడితే మాత్రం చమురు ధరలు పెరిగే అవకాశ ఉంది. అంటే అమెరికా హెచ్చిరికలు చూస్తే మరో మూడునాలుగు రోజులు యుద్ధం కొనసాగే ప్రమాదం ఉంది. ఇరాన్ అంతు చూస్తామని ట్రంప్ హెచ్చరికలు చేస్తున్నారు. కాబట్టి ఇప్పట్లో మంటలు చల్లారేలా లేవు. పైగా యుద్ధం విస్తరిస్తోంది. లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులకు దిగింది. హిజ్బుల్ లక్ష్యంగా చేస్తున్న దాడుల కారణంగా ఇది విస్తరించడమే తప్ప ఆగిపోతుందనుకోవడానికి లేదు. అందువల్ల భారత్ సంయమనంతో ముందుకు సాగాల్సి ఉంటుంది.

## హర్మూజ్ జలసంధి మూసివేత

టెహ్రాన్: పశ్చిమాసియాలో ఘర్షణ వాతావరణం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. ఇప్పటికే ముడిచమురు ధరలు పెరుగుతుండగా.. ఇరాన్ ఇచ్చిన వార్నింగ్ మరింత ఆందోళనకు దారితీస్తోంది. హోర్మూజ్ జలసంధి ని మూసివేశామని, నౌకలు దానిని దాటడానికి ప్రయత్నిస్తే నిప్పు పెడతామని హెచ్చరించింది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్, నౌకాదళ సిబ్బంది ఆ పని చేస్తారని ఇరాన్ హెచ్చరించింది. హోర్మూజ్ జలసంధిని మూసివేశామని, ఆ జలసంధి గుండా వెళ్లేందుకు ప్రయత్నించే ఏ నౌకపైనైనా కాల్పులు జరుపుతామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్ ఇన్ చీఫ్ సీనియర్ సలహాదారు ఇబ్రహీం జబారీ ప్రకటించారు. నౌకలు ఈ జలసంధిని దాటడానికి ప్రయత్నిస్తే దాడి చేస్తామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ పేర్కొన్నట్లు అధికారిక మీడియా వెల్లడించింది. ప్రపంచ ఆయిల్ రవాణాలో ఐదవ వంతు ఈ జలసంధి ద్వారానే సరఫరా అవుతుంది. దీంతో ఈ చర్య చమురు ధరలు పెరిగే అవకాశం ఉందని కెప్లర్ గణాంకాలు హెచ్చరించిన సంగతి తెలిసిందే. హోర్మూజ్.. ప్రపంచ ఇంధనానికి జీవనాడి వంటిది. కేవలం కొన్ని కిలోమీటర్ల వెడల్పు ఉన్న ఈ ప్రదేశం నుంచి ప్రపంచం వాడే చమురులో ఐదోవంతు రవాణా అవుతోంది. ఈ జలసంధిలో ఏర్పడే ఏ అంతరాయం అయినా ప్రపంచ వాణిజ్యాన్ని గజగజ లాడిస్తుంది. ఈ మార్గం నుంచి వచ్చే చమురు, ఎల్ఎన్జీ అత్యధికంగా భారత్, చైనా, దక్షిణ కొరియా, జపాన్ దేశాలకు ఎగుమతి అవుతోంది. ఇంతటి కీలకమైన జలసంధి మూసుకుపోతే.. రవాణా, బీమా ఖర్చులు గణనీయంగా పెరుగుతాయి. ఇప్పటికే ఆ ప్రభావం కనిపిస్తోంది. చమురు ధరలు భగ్గుమంటు న్నాయి. కాగా.. అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో తమ సుప్రీంనేత ఖమేనీ మృతి చెందడంతో ఇరాన్ రగిలిపోతోంది. ఈ నేపథ్యంలోనే హోర్మూజ్‌ను మూసివేసినట్లు ప్రకటించింది. డేటా అండ్ అనలిటిక్స్ సంస్థ కెప్లర్ గణాంకాల ప్రకారం.. సుమారు 150 ఆయిల్ ట్యాంకర్లు ఇప్పటికే ఈ హోర్మూజ్ నుంచి వెళ్లేందుకు ఎదురుచూస్తున్నాయి. మరోవైపు హోర్మూజ్ తూర్పువైపున 60 ట్యాంకర్లు వేచిచూస్తున్నాయి. ఇదిలాఉంటే, ఫిబ్రవరి మధ్యలో సైనిక విన్యాసాల కోసం జలసంధిలో కొంతభాగాన్ని ఇరాన్ మూసివేయగా.. అప్పుడు చమురు ధరలు 6 శాతం మేర పెరిగాయి.

## ఖమేనీ హత్య కోసం ఇజ్రాయిల్ నిరంతర నిఘా

వాషింగ్టన్: ఆధునిక యుద్ధవిద్యలో ఇప్పుడు పక్కాగా సమాచార సేవకరణ, దానిని అమలు పర్చడంలో అమెరికా-ఇజ్రాయెల్ విజయం సాధించాయని విదేవీ వార్తా సంస్థలు చెబుతున్నాయి. ముఖ్యంగా పక్కా ప్లాన్‌తో దాడుల్లో ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ అంతమొందించడం సంచలనం సృష్టించింది. ఖమేనీ ఎక్కడ ఉంటారు..? ఎవరిని కలుస్తున్నారు..? ఇతరులతో ఎలా కమ్యూనికేట్ అవుతారు..? తన ప్రాణానికి ఏదైనా హాని ఉంటే ఎక్కడికి వెళ్తారన్న ప్రతి విషయాన్ని యూఎస్, ఇజ్రాయెల్ నిఘా వర్గాలు సునిశితంగా అధ్యయనం చేశాయని వెల్లడించాయి. ఆయనతో సమావేశమయ్యే రాజకీయ, మిలిటరీ ఉన్నతాధికారుల్ని కూడా ట్రాక్ చేసినట్లు తెలుస్తోంది. మాకు జెరూసలెం గురించి ఎంత తెలుసో.. టెహ్రాన్ గురించి కూడా అంతే బాగా తెలుసు అని ఆ వర్గాలు పేర్కొనడం గమనార్హం. ఎప్పటికప్పుడు సేకరించిన సమాచారాన్ని ఒక క్రమంలోకి తీసుకువచ్చేందుకు ఇజ్రాయెల్ ఏఐ టూల్స్, అల్గారిథమ్స్‌ను ఉపయోగించిందని అంటున్నారు. కొన్నేళ్లక్రితమే సుప్రీంలీడర్‌ను తమ టా÷-గ్గ్÷ట్‌లో పెట్టుకొన్న ఇజ్రాయెల్.. ఆయన కదలికలను పసిగట్టేందుకు ఇరాన్ ట్రాఫిక్ కెమెరా నెట్‌వర్క్, మొబైల్ ఫోన్ సిస్టమ్స్‌ను హ్యాక్ చేసిందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. రాజధాని నగరం టెహ్రాన్‌లోని అన్ని ట్రాఫిక్ కెమెరాలు ఏళ్లపాటు హ్యాకింగ్‌కు గురయ్యాయని ఇజ్రాయెల్ నిఘా విభాగంలో పనిచేసిన అధికారులు వెల్లడించారు. ఆ ఫుటేజీని ఎప్పటికప్పుడు ఎన్‌క్రిప్ట్ చేసి, స్వదేశానికి తెప్పించుకున్నట్లు పేర్కొన్నారు. టెహ్రాన్‌లోని పెస్టర్ స్ట్రీట్ సమీపంలోని సుప్రీంలీడర్‌కు చెందిన కాంపౌండ్‌లో రోజూవారీ కార్యకలాపాలను, ఖమేనీ వ్యక్తిగత భద్రతా సిబ్బంది వాహనాలను పార్క్ చేసిన ప్రదేశాలను ఒక కెమెరాతో నెతన్యాహు ప్రభుత్వం నిత్యం గుర్తించేదని ఆ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇక, ఈ ఫిబ్రవరి 28న కూడా అత్యంత కచ్చితత్వంతో ఖమేనీని టార్గెట్ చేయడానికి ఈ డేటానే ఉపయోగపడింది. ఇరాన్‌లో ప్రతి శుక్రవారం ప్రభుత్వ సెలవుదినం. ఖమేనీ ప్రతీ వారం ప్రారంభం రోజున శనివారం తన అధికారిక నివాసంలో కీలక ప్రభుత్వ పెద్దలు, సైనిక ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించేవారు. టెహ్రాన్ నగర నడిబొడ్డులోని ఒక ప్రభుత్వ ప్రాంగణంలో ఇరాన్ అత్యున్నత స్థాయి అధికారుల సమావేశం ఉంటుందని
ఇజ్రాయెల్ తెలుసుకొని దాడి చేసింది. ఈ వ్యవహారంలో అమెరికా నిఘా సంస్థ సీఐఏ ఇచ్చిన సమాచారం కూడా కీలకమైంది. ఇదిలాఉంటే.. శనివారం ఇజ్రాయెల్-యూఎస్ఏ చేపట్టిన సంయుక్త ఆపరేషన్‌లో ఇరాన్‌పై సైబర్ దాడులు కూడా జరిగాయని జెరూసలెం పోస్ట్ వెల్లడించింది. అత్యంత కీలకమైన మౌలిక సదుపాయాలతో పాటు సెక్యూరిటీ కమ్యూనికేషన్ సిస్టమ్స్, అధికారిక మీడియా సంస్థల సైట్లు హ్యాక్ అయ్యాయి.

# ఎముకలు బలంగా, ఆరోగ్యంగా ఉండాలంటే...!




మన ఎముకలు మంచి చేవగా, దృఢంగా ఉంటేనే మన శరీరం కూడా బలంగా ఉంటుంది. ఎముకలు బలహీనమైతే పెళుసుగా మారిపోతే చిన్న చిన్న కుదుపులు, దెబ్బలకు కూడా చిటుక్కున విరిగిపోతుంటాయి. వయసు పెరుగుతున్న కొద్దీ ఎముకలు పలు రకాల అనారోగ్యాలకు గురవుతూ.. బలహీనపడుతుంటాయి. మన ఎముకలను ఆరోగ్యంగా, దృడంగా ఉంచుకోవడానికి.. పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుంది. ఆరోగ్యకరమైన ఎముకలకు తగినంత కాల్షియం, విటమిన్ డి తీసుకోవడం చాలా ముఖ్యం. మన ఎముకలను స్ట్రాంగ్‌గా ఉంచే.. హెల్తీ.. టేస్టీ.. డ్రింక్స్ గురించి ఈ స్టోరీలో చూద్దాం.








పాలు... పాలలో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. వెన్న తొలగించిన పాలు తీసుకుంటే.. రోజూవారీ అవసరమైన 30 శాతం కాల్షియం శరీరానికి అందుతుంది. అంతేకాదు, పాలలో విటమిన్ డి అధికంగా ఉంటుంది. విటమిన్ కాల్షియంను సమర్థవంతంగా గ్రహిస్తుంది. మీరు ప్లాంట్ బేస్డ్ మిల్క్ కూడా తీసుకోవచ్చు. రోజూ ఒక గ్లాస్ పాలు తాగితే.. ఎముకలు దృఢంగా ఉంటాయి.

సోయా పాలు... పాలకు తగిన పోషకాల ప్రత్యామ్నాయం సోయాపాలు. ఎండిన సోయా బీన్స్‌ని నీళ్లల్లో నానబెట్టి ఈ పాలను తీయవచ్చు. లాక్టోజ్ పడనివాళ్లు కూడా దీన్ని ప్రయత్నించవచ్చు. సోయాపాలలో కాల్షియం సమృద్ధిగా ఉంటుంది. ఇది ఎముకల ఆరోగ్యాన్ని రక్షించడానికి సహాయపడతాయి. ఈ పాలను తాగితే రక్తనాళాలు బలపడతాయి. మెనోపాజ్ చిక్కులకు పరిష్కారం లభిస్తుంది. దీనిలో తక్కువ శాచురేటెడ్ ఫ్యాట్‌లూ, చక్కెరా ఉంటాయి.

గ్రీన్ స్మూతీ... మెగ్నీషియం, జింక్ సైతం ఎముక పటుత్వానికి తోడ్పడతాయి. సమతులాహారం తీసుకోవటం ద్వారా ఇవన్నీ లభిస్తాయి. విటమిన్ కె కూడా ముఖ్యమే. ఇది ఎముక ఏర్పడటంలో, గట్టి పడటంలో పాలు పంచుకునే ప్రొటీన్లను ప్రేరేపితం చేస్తుంది. ఎముకలు గుల్ల బారినవారిలో విటమిన్ కె ఎముక సాంద్రత పెరిగేలా చేస్తున్నట్టు, ఎముక విరిగిపోయే ముప్పు తగ్గిస్తున్నట్టు అధ్యయ నాలు పేర్కొంటున్నాయి. పాలకూర, తోటకూర వంటి ఆకు కూరల్లో ఈ పోషకాలు ఉంటాయి. ఆకుకూరలతో గ్రీన్ స్మూతీ చేసుకుని తాగొచ్చు.


బ్రకోలీ జ్యూస్.. బ్రకోలీలో కాల్షియంతో పాటు.. ఎముకల ఆరోగ్యానికి మేలు చేసే అనేక పోషకాలు నిండి ఉంటాయి. సి, కె- విటమిన్లూ పీచూ సమృద్ధిగా ఉన్న బ్రకోలీ రోగనిరోధక శక్తిని పెంచడమే కాదు, ఎముకల సంరక్షణకీ తోడ్పడు తుంది. దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా కాపాడుతుంది. బ్రకో లీ జ్యూస్ చేసుకుని తాగితే.. ఎముకలు స్ట్రాంగ్‌గా ఉంటా యి.


ఆరెంజ్ జ్యూస్.. ఆరెంజ్ జ్యూస్‌లో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచడానికే కాదు.. ఎముకల ఆరోగ్యానికీ మేలు చేస్తుంది. ఎముక పోగు పడటానికి పునాది వేసే ప్రొటీన్ పోచలు ఏర్పడటానికి విటమిన్ సి అత్యవసరం. దీని స్థాయులు ఎక్కువగా గలవారిలో ఎముక సాంద్రత అధికంగా ఉంటున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. రోజూ ఒకగ్లాస్ ఆరెంజ్ జ్యూస్ తాగితే.. ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. బోన్ బ్రోత్‌లో కాల్షియం, మెగ్నీషియంతో పూటు.. మినరల్స్ మెండుగా ఉంటాయి. కొల్లాజెన్ అధికంగా ఉండే ఈ డ్రింక్ ఎముకలకు అవసరమైన బిల్డింగ్ బ్లాక్‌లను అందించడమే కాకుండా, ఎముకల నిర్మాణానికి బలమైన మద్దతును కూడా అందిస్తుంది.

# కిచెన్ సింక్ స్మెల్ వస్తుందా..



కిచెన్ సరిగ్గా క్లీన్ చేయకపోతే చాలా స్మెల్ వస్తుంటుంది. ఇలాంటప్పుడు కొన్ని టిప్స్ ఫాలో అయితే కిచెన్ స్మెల్ రాకుండా ఉంటుంది. అవేంటో తెలుసుకోండి. కిచెన్ సింక్ నుంచి స్మెల్ వస్తుంటే అక్కడ ఉండలేం ఇబ్బందిగా ఉంటుంది. ఇదిలానే ఉంటే కీటకాలు, వైరస్ వస్తాయి. అలా కాకుండా ఉండాలంటే ఎక్కువగా క్లీన్ చేయాలి. అందుకోసం కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. అవేంటో తెలుసుకోండి.





వెనిగర్.. స్టౌ దగ్గర కిచెన్ వస్తే వెనిగర్ యూజ్ చేస్తే సమస్య తగ్గుతుంది. ఓ కప్పు నీటిలో 3 కప్పుల వెనిగర్ వేసి కాస్తా బేకింగ్ సోడా, నిమ్మరసం కలపాలి. ఈ మిశ్రమాన్ని పోసి సింక్ క్లీన్ చేయాలి. దీని వల్ల మరకలు, మురికి కూడా దూరమవుతుంది.

నాఫ్తలీన్ బాల్స్.. సింక్‌లోని వాసనని దూరం చేయడానికి ఈ బాల్స్ హెల్ప్ చేస్తాయి. వీటిని మనం బాత్‌రూమ్స్, అల్మారాల్లో పెడతారు. అయితే వీటిని సింక్‌లోపల కాకుండా కింద పైప్ దగ్గర పెట్టండి. దీని వల్ల వాసన దూరమవుతుంది.

నిమ్మ తొక్కలు.. నిమ్మతొక్కలని వాడడం వల్ల సింక్ క్లీన్ అవుతుంది. అందుకోసం నిమ్మరసం పిండి అందులో ఉప్పు వేసి సింక్ వేసి రుద్దండి. అలానే అరగంట ఉంచి తర్వాత క్లీన్ చేస్తే సింక్ క్లీన్ అవుతుంది. మంచి స్మెల్ వస్తుంది.

పెప్పర్‌మింట్ ఆయిల్.. కిచెన్ సింక్ నుండి స్మెల్‌ని దూరం చేసేందుకు పెప్పర్‌మింట్ ఆయిల్ హెల్ప్ చేస్తుంది. స్ప్రే బాటిల్‌లో కొద్దిగా నీరు పోసి అందులో 10 చుక్కల పిప్పరమెంట్ ఆయిల్ వేసి దీనిని స్ప్రే చేయాలి. దీని వల్ల స్మల్ దూరమవుతుంది.

సబ్బు, బేకింగ్ సోడా, రాక్ సాల్ట్..
సింక్ క్లీన్ చేయడానికి సాధారణంగా సబ్బు, బేకింగ్ సోడా, రాకింగ్ సాల్ట్‌తో క్లీన్ చేయొచ్చు. వీటిని కలిపి కిచెన్ సింక్‌ని క్లీన్ చేయొచ్చు. దీని వల్ల చాలా వరకూ సింక్ క్లీన్ అవుతుంది. స్మెల్ కూడా దూరమవుతుంది.

వేడి నీరు..అదే విధంగా వారానికి ఓ సారైనా వేడి నీరు పోయండి. దీని వల్ల జిడ్డు మరకలు, వ్యర్థాలు బయటకి వెళ్తాయి. దీంతో పాటు డ్రైనేజీ క్లీన్ చేస్తుండాలి. దీని వల్ల సింక్ ఎక్కువగా స్మెల్ రాదు.

# శీతాకాలం ఈ మాస్క్ అప్లై చేస్తే..



శీతాకాలంలో వాతావరణం ఎఫెక్ట్ జుట్టుపై ఎక్కువ పడుతుంది. ఈ సీజన్‌లో చలిగాలుల ప్రభావం, వాతావరణంలో ఉండే తేమ, పొగమంచు.. వంటి కారణాల వల్ల జుట్టు పొడిబారుతుంది, అట్టలా మారుతుంది, చిక్కులు కూడా ఎక్కువగా పడుతుంది. హెల్తీ హెయిర్ ఉన్నవారి పరిస్థితే ఇలా ఉంటే.. డ్రై హెయిర్ ఉన్నవారి బాధలు చెప్పనవసరం లేదు. చలికాలంలో చల్లని గాలుల జుట్టులోని నూనె తీసివస్తాయి, జుట్టును డీహైడ్రేట్ చేస్తాయి. ఈ సీజన్‌లో మీ జుట్టును ఆరోగ్యంగా ఉంచుకోవడానికి, మృదువుగా మార్చుకోవడానికి.. కొన్ని న్యాచురల్ హెయిర్ మాస్క్‌లు సహాయపడతాయి. అవేంటో ఈ స్టోరీలో చూద్దాం.

తేనె, పాలతో.. ఈ సీజన్‌లో డ్రై హెయిర్ సమస్యను దూరం చేయడానికి, చిక్కులు సమస్యను తగ్గించుకోవడానికి.. తేనె, పాల హెయిర్ మాస్క్ ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది. తేనె జుట్టుకు తేమనందిస్తుంది. పాలలోని ప్రొటీన్లు, అమినో యాసిడ్స్ మీ జుట్టును లోతుగా హైడ్రేట్ చేస్తాయి. వాటిని మృదువుగా ఉంచుతాయి. జుట్టు చిక్కులు విడదీస్తాయి. మీ మాస్క్ వేసుకోవడానికి.. అరకప్పు పాలలో.. రెండు టేబుల్ స్పూన్ల తేనె వేసి మిక్స్ చేయండి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు మాస్క్‌లా అప్లై చేసుకోండి. దీన్ని 30 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వాత ఘాడత తక్కువగా ఉన్న షాంపూతో తలస్నానం చేయండి. ఈ మాస్క్ వారానికి రెండుసార్లు వేస్తే.. జుట్టు హెల్తీగా, సిల్కీగా ఉంటుంది. హెయిర్ గ్రోత్‌ను కూడా ప్రోత్సహిస్తుంది.

అరటి పండు, కొబ్బరి నూనెతో.. అరటిపండ్లులోని విటమిన్లు, మెగ్నీషియం, పొటాషియం , సిలికాన్ వంటి పోషకాలు జుట్టుని ఆరోగ్యంగా ఉంచుతాయి. కొబ్బరి నూనె జుట్టును హైడ్రేటింగ్‌గా ఉంచడంతో పాటు అనేక ప్రయోజనాలు అందిస్తుంది. ఈ మాస్క్ పొడిబారిన జుట్టును పట్టులా మారుస్తుంది, చిక్కులు పడకుండా చేస్తుంది. ఈ మాస్క్ తయారు చేసుకోవడానికి.. బాగా పండిన మెత్తటి అరటి పండులో.. రెండు టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనె వేసి మిక్స్ చేయండి. ఈ మిశ్రమాన్ని జుట్టు మాస్క్‌లా అప్లై చేయండి. మీ జుట్టును షవర్ క్యాప్‌తో కవర్ చేసి.. 20 నుంచి 30 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వాత గోరువెచ్చని నీళ్లతో తలస్నానం చేయండి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే.. మంచి రిజల్ట్స్ ఉంటాయి.






అవకాడో, కొబ్బరి పాలతో.. అరకప్పు కొబ్బరిపాలలో మూడు టేబుల్ స్పూన్ల ఆలివ్ ఆయిల్, రెండు టేబుల్ స్పూన్ల అవకాడో గుజ్జు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కురులకు అప్లై చేసి 20 నుంచి 30 నిమిషాల పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత మైల్డ్ షాంపూ ఉపయోగించి తలస్నానం చేసి, నాణ్యమైన కండిషనర్ అప్లై చేసుకోవాలి. ఈ ప్యాక్‌లో మనం ఉపయోగించే అవకాడో కురులకు తగినంత తేమ అందించి అవి ప్రకాశవంతంగా కనిపించేలా చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది.


కలబంద, ఆలివ్ ఆయిల్ మాస్క్.. కలబంద.. జుట్టుకు పెట్టడం వల్ల జుట్టులో సహజసిద్ధమైన తేమ నిలిచి ఉంటుంది. కలబందను ఆలవ్ ఆయిల్‌తో మిక్స్ చేసి అప్లై చేస్తే... పొడిబారిన, చిట్లిన జుట్టును మృదువుగా ఆరోగ్యంగా మారుస్తుంది. రెండు టేబుల్ స్పూన్ల తాజా కలబంద గుజ్జులో మూడు టేబుల్ స్పూన్ల ఆలివ్ ఆయిల్ కలపండి. మాడుకు, జుట్టుకు ఈ మిశ్రమాన్ని అప్లై చేయండి. దీన్ని 30 నిమిషాల పాటు ఆరనిచ్చి.. గోరువెచ్చని నీళ్లతో తలస్నానం చేయండి. ఈ మాస్క్ స్కాల్ప్‌ను శాంతపరచి, జుట్టును ఆరోగ్యంగా ఉంచుతుంది.

# డయాబెటిస్ ఉందా..?




డయాబెటిస్..
ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా మానవాళిని పట్టి పీడిస్తున్న అతిపెద్ద ఆరోగ్య సమస్య. మన దేశంలోనూ డయాబెటిస్ కేసులు విస్తృతంగా పెరుగుతున్నాయి. విస్తృతిపై (ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రిసెర్చ్) చేసిన ఓ అధ్యయనం తాజాగా యూకేకు చెందిన మెడికల్ జర్నల్ లాన్‌సెట్‌లో ప్రచురితమైంది. ఆ అధ్యయనం ప్రకారం ప్రస్తుతం మన దేశంలో మధుమేహుల సంఖ్య 10 కోట్ల మార్కును దాటింది. మధుమేహం సైలెంట్ కిల్లర్. దీర్ఘకాలం పాటు బ్లడ్ షుగర్ లెవల్స్ కంట్రోల్‌లో లేకపోతే.. కిడ్నీ, నరాల సమస్యలు, హైపర్‌టెన్షన్, గుండె సమస్యల ముప్పు పెరుగుతుంది. చెడు ఆహార అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం, మానసిక ఒత్తిళ్లు కారణంగా డయాబెటిస్ వచ్చే అవకాశం ఉంది. అంతేకాగు, జన్యుపరమైన కారణాల వల్ల కూడా షుగర్ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. మీ కుటుంబంలో ఎవరైనా.. షుగర్ వ్యాధితో బాధపడుతుంటే, మీకు మధుమేహం ముప్పు పొంచిఉన్నట్లే. మీరు షుగర్ వ్యాధి బారిన పడకుండా.. మరింత శ్రద్ధ తీసుకోవాలసిన అవసరం చాలానే ఉంది. పోషకాహార నిపుణురాలు లీమా మహాజన్ మీరు తీసుకోవాలసిన 5 జాగ్రత్తల గురించి ఇన్‌స్టా గ్రామ్ స్టోరీలో వివరించారు.





తగినంత ప్రొటీన్ తీసుకోండి.. ఆరోగ్యంగా ఉండటానికి ప్రొటీన్ అత్యవసరం. అమైనో ఆమ్లాలతో కూడిన ఇది కణజాలాల తయారీ, మరమ్మతు, దృఢత్వంలో కీలక పాత్ర పోషిస్తుంది. శరీరంలో జరిగే జీవక్రియలన్నీ వీటి రూపంలోనే సాగుతాయి. గ నిరోధక వ్యవస్థ సక్రమంగా పని చేయటానికి, హార్మోన్ల నియంత్రణకు, కండరాల దృఢత్వానికివి కీలకం. అంతేకాదు, ప్రొటీన్ మన కడుపును నిండుగా ఉంచి, అతిగా తినకుండా నిరోధిస్తుంది. తద్వారా బరువు కంట్రోల్‌లో ఉంటుంది. ప్రతిరోజూ మీ శరీర బరువుకు కనీసం 1 గ్రాము ప్రొటీన్ తీసుకోండి.

పిండి పదార్థాలు మనకు శత్రువు కాద కానీ, అతిగా తీసుకోవడం మంచిది కాదు. మీ డైట్‌లో కార్బోహైడ్రేట్లను తక్కువగానే తీసుకోండి. వాటికి బదులుగా, ప్రొటీన్లు, కూరగాయలు, చిక్కుళ్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు మీ ఆహారంలో తీసుకోండి. ఇవి మీ రక్తప్రవాహంలోకి గ్లూకోజ్‌ను నెమ్మదిగా విడుదల చేస్తాయి. మీ బ్లడ్ షుగర్ లెవల్స్‌ను కంట్రోల్‌లో ఉంచుతాయి.

యాపిల్ సైడర్ వెనిగర్ తీసుకోండి.. బ్లడ్ షుగర్ లెవల్స్‌ను కంట్రోల్‌లో ఉంచడానికి.. యాపిల్ సైడర్ వెనిగర్ సహాయపడుతుంది. మీ భోజనానికి 30 నిమిషాల ముందు గ్లాస్ వాటర్‌లో ఒక టేబుల్ స్పూన్ యాపిల్ సైడర్ వెనిగర్ మిక్స్ చేసి తీసుకోండి. ఇది ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడంలో సహాయపడుతుంది, భోజనానంతర చక్కెర స్పైక్‌లను మెయింటేన్ చేస్తుంది.

భోజనానికీ.. భోజనానికీ మధ్య గ్యాప్ ఇవ్వండి.. ప్రతి భోజనం మధ్య 4-5 గంటల గ్యాప్ ఇవ్వండి. రాత్రి 7 గంటల ముందే భోజనం పూర్తి చేసేయడానికి ప్రయత్నించండి. అంతేకాదు, నేట్ క్రేవింగ్స్‌ను అదుపులో ఉంచుకోండి. ఈ ఉపవాస కాలంలో మన శరీరం గ్లూకోజ్‌ను సమర్థవంతంగా ప్రాసెస్ చేస్తుంది, అనవసరమైన బ్లడ్ షుగర్ స్పైక్‌లను నివారిస్తుంది.




రోజూ వ్యాయామం చేయండి.. శారీరకంగా యాక్టివ్‌గా ఉండటానికి ప్రయత్నించండి. 30 ఏళ్ల లోపుంటే పరుగు, జిమ్‌కు వెళ్లవచ్చు..ఆపై వయసు వారు నడక, ఎరోబిక్స్, యోగా లాంటివి చేస్తే ఆరోగ్యం బాగుంటుంది. రోజులో కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేస్తే మంచిదని నిపుణులు అంటున్నారు.

# ఈ నూనెలతో మసాజ్ చేస్తే పొడిబారకుండా స్కిన్ మెరుస్తుంది..







చలికాలంలో ఈ నూనెలతో మసాజ్ చేస్తే పొడిబారకుండా స్కిన్ మెరుస్తుంది.. చలికాలంలో స్కిన్ కేర్ అనేది చాలా ముఖ్యం. ఎందుకంటే చల్లి వాతావరణంలో రంధ్రాలు బిగుతుగా ఉంటాయి. కాబట్టి, చర్మం ఎక్కువగా మురికి లేకుండా, తాజాగా ఉన్నప్పటికీ కొన్ని సమస్యలొస్తాయి. వాటిని దూరం చేసుకోవాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. చలికాలంలో చర్మాన్ని కాపాడుకోవాలంటే ఎలాంటి టిప్స్ పాటించాలో తెలుసుకోండి.

ఎందుకు పొడిబారుతుంది.. చలికాలంలో చర్మ సమస్యలు రావడం చాలా కామన్. చల్లని గాలుల కారణంగా చర్మం నుండి తేమ ఆవిరైపోతుంది. దీంతో స్కిన్ డ్రైగా మారుతుంది. బయట వచ్చే చల్లని ఉష్ణోగ్రతల కారణంగా బాడీ లోపల వేడిని స్టోర్ చేసేందుకు ట్రై చేస్తుంది. దీంతో రక్త ప్రసరణ తగ్గుతుంది. చర్మంలో ఆయిల్ స్రావాన్ని తగ్గిస్తుంది. దీని వల్ల స్కిన్ డ్రైగా మారతుంది. దీనికోసం చర్మం పొడిబారకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అవేంటో తెలుసుకోండి.

ఫేస్ ప్యాక్స్.. ఆయుర్వేద ఫేస్ ప్యాక్స్ సహజ పదార్థాలను కలిగి ఉంటుంది. ఇది చర్మాన్ని హైడ్రేట్ చేసి పొడిబారకుండా చేస్తుంది. ఇది చర్మాన్ని తాజాగా ఉంచుతుంది. ఆయుర్వేదంలో కొన్ని అత్యుత్తమ ఫేస్‌ప్యాక్స్ ఉన్నాయి. రకరకాల ఫేస్‌ప్యాక్స్‌ని తయారు చేసుకుని వాడొచ్చు.

ఏయే ప్యాక్స్.. ప్యాక్స్‌లో ఎక్కువగా పాలు, బాదం, రోజ్ వాటర్‌తో ప్యాక్ వేసుకోవచ్చు. వీటితో పాటు బొప్పాయి, తేనె, అరటిపండు, కలబంద, పాలు, తేనె, అలోవేరా, మీగడ వీటని ఉపయోగించి ప్యాక్ వేసుకుంటే చాలా వరకూ చర్మంలో తేమ పెరిగి పొడిబారడం తగ్గుతుంది.

ఆయిల్ మసాజ్.. చలికాలంలో చర్మంలో నూనె ఉత్పత్తిని పెంచుతుంది. ఆయిల్ మసాజ్ చాలా మంచిది. అందుకోసం ఏ ఆయిల్స్ వాడాలో తెలుసుకోండి. బాదం నూనె, భృంగరాజ్ ఆయిల్, మంచి నూనె ఇవన్నీ కూడా చర్మానికి మేలు చేస్తాయి..

ఏ నూనె వాడితే ఏ లాభాలు.. వేప నూనె.. ఇది అన్ని చర్మాలకు సూట్ అవుతుంది. వాపు, ఇన్ఫెక్షన్, మొటిమలు, చర్మ అలర్జీలని తగ్గిస్తుంది.

కొబ్బరినూనె : ఇది దద్దుర్లు, ఎరుపెక్కడ, చిన్న ఇన్ఫెక్షన్లని దూరం చేస్తుంది.

బాదం నూనె : మొటిమలని తగ్గించి చర్మాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుంది.

షాదావరి : షాదావరి ఆయిల్‌లో యాంటీ ఏజింగ్ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది డ్రైనెస్ సమస్యని దూరం చేస్తుంది. చర్మాన్ని దృఢంగా, సాగేలా చేస్తుంది.

భృంగరాజ్ ఆయిల్ .. భృంగరాజ్ ఆయిల్ మొటిమలు, చర్మ సమస్యల్ని తగ్గిస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు.

# బాణాసంచా తయారీ కేంద్రంలో విస్ఫోటనం

కాకినాడ: కాకినాడ జిల్లాలోని సామర్లకోట మండలంలోని బాణసంచా తయారీ పరిశ్రమలో భారీ పేలుడు సంభవించింది. వేట్లపాలెం పరిధి గోదావరి కెనాల్ పక్కన ఉన్న సూర్యశ్రీ ఫైర్ వర్క్స్ కేంద్రంలో శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 20 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. భారీ ఎత్తున మంటలు ఎగసిపడడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది. పేలుడు శబ్దాలు సుమారు 5 కిలోమీటర్ల మేర వినిపించాయని స్థానికులు తెలిపారు. శబ్దం తీవ్రతకు పక్క గ్రామంలో ఉన్న ప్రైవేటు పాఠశాలలో శ్లాబ్‌కు పగుళ్లు వచ్చాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలు ఆర్పేందుకు 2 ఫైర్ ఇంజిన్ల సాయంతో రంగంలోకి దిగారు. తీవ్రంగా గాయపడిన 8 మందిని అంబులెన్స్‌లో స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతుల్లో ఎక్కువ మంది మహిళలే ఉన్నట్లు సమాచారం. బాణసంచా పరిశ్రమను అడపా నాని కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. పరిమితికి మించి బాణసంచా తయారు చేయడం వల్లే ఘటన జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. పేలుడు సంభవించినప్పుడు భారీ శబ్దం వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. పేలుడు ధాటికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఐదు గ్రామాల పరిధిలో దట్టమైన పొగలు అలముకున్నాయి. పేలుడు సంభవించే ప్రాంతానికి స్థానికులు చేరుకున్నప్పటికే అందులో చిక్కుకున్న పలువురు అగ్నికి ఆహుతయ్యారు. ఘటనాస్థలిలో శరీరభాగాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. కొన్ని మృతదేహాలు పూర్తిగా కాలిపోయాయి. మృతుల్లో ఇప్పటి వరకు 11 మందిని పోలీసులు గుర్తించారు. మృతులను అడబాల శ్రీను, కడింపల్లి కృపమ్మ, కడింపల్లి ధనరాజు, సాధనాల సత్యవేణి, వట్లూరి రవి, మందపల్లి చిన్ని, నిమ్మద కరుణ, గంపల మంగ, గొడతా మహేశ్, గొడతా రాము, గొడతా నానిగా పోలీసులు పేర్కొన్నారు. ఇంకా కొద్ది మంది మృతదేహాలను గుర్తించాల్సి ఉంది. టపాసులు తయారు చేస్తుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించినట్లు సమాచారం. పేలుడు ధాటికి మృతదేహాలు చెల్లాచెదురుగా పడ్డాయి. అలాగే ఈ ప్రమాదంలో అనేమంది కార్మికులకు తీవ్ర గాయాలు అయ్యాయి. పేలుడు సమయంలో మొత్తం 30 మంది కార్మికులు ఉన్నట్లు తెలుస్తోంది. భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. పేలుడుతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలముకుంది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేసేందుకు యత్నించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. మృతుల్లో ఎక్కువమంది మహిళలు ఉన్నారు. పేలుడు శబ్దం విని స్థానికులు భారీగా అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఘటనాస్థలిలో మృతుల బంధువుల ఆర్తనాదాలు మిన్నంటాయి.



## పేలుడు ఘటనపై చంద్రబాబు దిగ్భ్రాంతి

విజయనగరం:కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాద ఘటనపై ఆరా తసిన సిఎం అధికారులతో మాట్లాడారు. విజయనగరం పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రికి ప్రమాద ఘటన గురించి అధికారులు తెలియజేశారు. దీంతో విజయనగరం నుంచే ఉన్నతాధికారులతో సీఎం మాట్లాడారు. ప్రమాదానికి కారణాలు... ప్రస్తుతం అక్కడ అందుతున్న సహాయక చర్యలపై ఆరా తీశారు. ప్రమాదం జరిగిన సూర్య ఫైర్ వర్క్స్‌లో 20 మంది వరకు పని చేస్తున్నారని అధికారులు తెలియజేశారు. బాణసంచా తయారీదారులు ప్రాణాలు కోల్పోవడంపై ముఖ్యమంత్రి విచారం వ్యక్తం చేశారు. మంత్రులు, ఉన్నతాధికారులు ఘటనాస్థలానికి వెళ్లాల్సిందిగా సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రమాదంపై సామాజిక మాధ్యమం ఎక్స్‌లోనూ స్పందించారు సీఎం. బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ఘటన తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. ఈ ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. బాధితులకు అవసరమైన తక్షణ సాయం అందించాలని ఆదేశించామని చెప్పారు. సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నామని.. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

బాధితులకు అవసరమైన తక్షణ సాయం అందించాలని అధికారులను ఆదేశించామన్నారు. ఘటనాస్థలంలో అధికారులు సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. పేలుడు ఘటనలో బాధిత కుటుంబాలను ఆదుకుంటామని చంద్రబాబు తెలిపారు. బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ఘటనపై హోం మంత్రి అనిత స్పందించారు. కార్మికుల మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. విజయనగరం జిల్లా చీపురుపల్లిలో సీఎం పర్యటన సందర్భంగా అక్కడ ఉన్న ఆమె.. హుటాహుటీన సంఘటన స్థలికి బయల్దేరి వెళ్లారు. కాకినాడ జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఎప్పటికప్పుడు మాట్లాడి ఘటనపై ఆరా తీశారు. బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సమాచారం తెలిసి తీవ్ర దిగ్భ్రాతికి గురయ్యాను. పలువురు మృత్యువాత పడటం మాటలకు అందని విషాదం. మృతులకు నివాళులు అర్పిస్తున్నాను. మృతుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుంది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తాం అని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పేలుడు ఘటనపై ఇంఛార్జి మంత్రి నారాయణ తీవ్ర దిగ్భ్రాత్రి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఘటనకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అత్యవసర చికిత్స అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఘటనాస్థలికి వైద్యులను పంపించి తక్షణ వైద్యసాయం అందించాలని ఆదేశించారు.



# 27నుంచి ఒంటిమిట్ట వార్షిక బ్రహ్మోత్సవాలు

తిరుమల: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల బుక్‌లెట్‌ను ఈవో ఎం.రవిచంద్రతో కలిసి తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆవిష్కరించారు. తిరుమల అన్నమయ్య భవన్‌లో శనివారం బోర్డు సమావేశం అనంతరం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ.. మార్చి 27 నుంచి ఏప్రిల్ 5 వరకు ఒంటిమిట్ట శ్రీ కోందండరామాలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 1న రాష్ట్ర పండుగగా శ్రీ సీతారాముల కల్యాణాన్ని తితిదే అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు వి.వీరబ్రహ్మం, డా.ఎ.శరత్, సీవీఎస్వో మురళీకృష్ణ, పలువురు బోర్డు సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామి అనుగ్రహంతో శ్రీ పరాభవ నామ సంవత్సరంలో ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సకల ఐశ్వర్యాలు సమకూరాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. ధర్మ ప్రచారంలో భాగంగా తితిదే ప్రతి ఏడాది ఉగాది నాటికి పంచాంగాలను ముద్రించి అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రాబోయే శ్రీ పరాభవ నామ సంవత్సర పంచాంగాన్ని ఆకర్షణీయంగా ముద్రించింది. పంచాంగాన్ని తితిదే ఆస్థాన సిద్దాంతి తంగిరాల వేంకటకృష్ణ పూర్ణ ప్రసాద్ సిద్దాంతి రచించారు. రాజాధి నవనాయకుల ఫలితాలతోపాటు రాశిఫలాలు, వధూవర గుణమేళనం, వివాహాది సుముహూర్త నిర్ణయాలు, తితిదేలో నిర్వహించే విశేష ఉత్సవాలు తదితర విషయాలను చక్కగా వివరించారు.

# శ్రీవారి ముడుపు పత్రం పథకం' ప్రారంభం



తిరుమల,ఫిబ్రవరి28(ఆర్ఎన్ఎ): టీటీడీ 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.5,456.26 కోట్ల బ్జడెట్‌కు ధర్మకర్తల మండలి ఆమోదం తెలిపిందని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ బడ్జెట్‌కు ఆమోదం తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు.తిరుమల అన్నమయ్య భవనంలో ఈవో ఎం.రవిచంద్రతో కలసి శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో టీటీడీ బోర్డు సబ్ కమిటీ సిఫార్సుల మేరకు టీటీడీ చరిత్రలో తొలిసారిగా తిరుమల తిరుపతి దేవస్థానం విద్యా సంస్థల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో మెరుగైన విద్యను అందించేందుకు గాను రూ.118.89 కోట్లు కేటాయింపు చేశారు.. ఇందులో భాగంగా డిజిటల్ క్లాస్ రూములు, అదనపు హాస్టల్ బ్లాకులు, వంట గదుల ఆధునీకరణ, ఇతర మౌళిక సదుపాయాలు వంటి సమూలమైన మార్పులను తీసుకొచ్చేందుకు ఆమోదం ఇచ్చింది. భక్తుల విజ్ఞప్తి మేరకు శ్రీవారికి ముడుపులు అందించే దాతల సౌకర్యార్థం 'శ్రీవారి ముడుపు పత్రం పథకం' ను ప్రయోగాత్మకంగా ప్రారంభించాలనే నిర్ణయం తీసుకున్నాం. ప్రస్తుతం భక్తులు మొక్కుల రూపంలో శ్రీవారి హుండీలో కానుకలు వేస్తున్నారు. ఇందుకు బదులుగా భక్తులు తిరుమలలో ఏర్పాటు చేసే కౌంటర్లలో చెల్లింపులు చేస్తే అందుకు తగిన ముడుపు పత్రాలు అందజేస్తారు. వాటిని నేరుగా శ్రీవారి హుండీలో వేయవచ్చు. తద్వారా భక్తులు నగదు, నాణెళిలు తీసుకువచ్చేందుకు ఉన్న ఇబ్బందులు తొలగుతాయి. తిరుమలలో భక్తుల సౌకర్యార్థం అదనంగా మరో అన్న ప్రసాద భవనం, ఆధునిక వంటశాలను అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించేందుకు రిలయన్స్ సంస్థ రూ.100 కోట్ల నుండి రూ.120 కోట్లు విరాళం అందించేందుకు ముందుకు రావడంతో పనులు ప్రారంభించేందుకు ఆమోదం ఇచ్చారు. ఆలయాలు, ప్రాకారాలు, రాజ గోపురాలు తదితర నిర్మాణాలకు అయ్యే ఖర్చును దృష్టిలో ఉంచుకుని తదనుగుణంగా శ్రీవాణి ట్రస్టు మార్గదర్శకాలను మార్పు చేసేందుకు ఆమోదం ఇచ్చారు. ఒంటిమిట్టలో 108 అడుగుల జాంబవంతుడి విగ్రహం ఏర్పాటుకు గాను డ్రై ఐల్యాండ్ నిర్మించేందుకు నిర్ణయం. అందుకుగాను రూ.20.17 కోట్లతో పనులకు ఆమోదం. కోయంబత్తూర్, గువహటి, బెలగావి, అదేవిధంగా పాట్నా వద్ద మోకామ నగరంలో శ్రీవారి ఆలయాల నిర్మాణాలకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు టీటీడీకి కేటాయించిన భూమిని తీసుకునేందుకు ఆమోదం. వకుళమాత ఆలయంలో అక్షర గోవిందం పేరుతో అక్షరాభాస్య కార్యక్రమం ప్రారంభించాలని నిర్ణయం. ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 1వ తేదీన జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణానికి విచ్చేసే దాదాపు 70 వేల మంది భక్తులకు ఈ ఏడాది అదనంగా రూ.50 విలువ చేసే తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని ఉచితంగా అందించాలని నిర్ణయించాం. గత ఏడాది తలంబ్రాల ప్యాకెట్ కిట్‌ను అందించిన విషయం తెలిసిందే. ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భక్తులను ఆకట్టుకునేలా రూ. 4.25 కోట్లతో విద్యుత్ అలంకరణలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, ఎల్ఈడి బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.ఆర్మీ వెల్ఫేర్ ప్లేస్ మెంట్ ఆర్గనైజేషన్ ద్వారా తిరుపతిలో 356 మంది, తిరుమలలో 371 మంది భద్రత సిబ్బంది నియామకానికి ఆమోదం. అలిపిరి తనిఖీ కేంద్రంలో రూ.8 కోట్లతో ఎక్స్ రే బ్యాగేజ్ స్కానర్లు, డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు ఏర్పాటుకు ఆమోదం. తిరుమల, తిరుపతిలోని టీటీడీ గోశాలలు, పలమనేరు లోని శ్రీవేంకటేశ్వర ఇంక్యూబేషన్ సెంటర్ లలో రూ.11.28 కోట్లతో అభివృద్ధి పనులకు ఆమోదం. టీటీడీ ఆలయాల్లో పరిచారకులుగా పని చేస్తున్న 51 మందికి అర్చకులుగా పదోన్నతి కల్పించేందుకు గాను ప్రభుత్వానికి నివేదించాలని నిర్ణయం. పార్వతీపురం మన్యం జిల్లాలో శ్రీ వేంకటేశ్వర దివ్య క్షేత్రం నిర్మాణానికి రూ.14.25 కోట్లు కేటాయింపు. తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి ఆలయం చుట్టూ సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులకు ఆమోదం. టీటీడీ ఆలయాలు, సత్రాలు, విశ్రాంతి భవనాలు, యాత్రికుల వసతి సముదాయాలు, విద్యా సంస్థలు, ఆసుపత్రులు, కల్యాణ మండపాల భద్రతను పర్యవేక్షించేందుకు తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో రూ.10.75 కోట్లతో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుకు ఆమోదం. ఇటీవల చాలామంది తమ స్వప్రయోజనాల కోసం తిరుమలలో అసత్య కథనాలతో రీల్స్ చేసి సోషియల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. ఎంతో భక్తితో తిరుమల పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తుల మనోభావాలను దెబ్బతినేలా పోస్టు పెట్టేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టీటీడీ హెచ్చరిస్తోంది. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు వి.వీరబ్రహ్మం, డా.ఎ.శరత్, సివిఎస్వో మురళికృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి ఎన్నికల్లోనూ ప్రజలు అండగా ఉన్నారు

**ప్రజలకు మేలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం**

**పారిశ్రామికీకరణలో తెలంగాణ ఆదర్శం కావాలి**

**ప్రతి ప్రభుత్వ ఆఫీస్‌కు సొంత భవనం ఉండాల్సిందే**

**పాత పద్దతి నుంచి..సాంకేతికంగా అప్‌డేట్ కావాల్సిందే**

**ఆన్‌లైన్ విధానంలో అన్ని పనులు జరిగేలా చూడాలి**

**నిర్ణీత సమయంలో ఫైళ్లు క్లీయర్ చేయాల్సిందే**

**99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై అధికారులతో చర్చ**

**ఫ్యూచర్ సిటీపై దృష్టి పెట్టి పనిచేయండి**

**అధికారులకు దిశానిర్దేశం చేసిన సిఎం రేవంత్**



హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి శనివారం సచివాలయంలో వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై సమావేశంలో అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. మార్చి నుంచి జూన్ వరకు 99 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎంఓ అధికారులు పాల్గొన్నారు. మార్చి 4 న జరిగే కలెక్టర్ల సమావేశంలో అందరి పని తీరుపైన మాట్లాడుతానని అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక పేరు తో 99 రోజుల కార్యాచరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం కోసం ప్రత్యేక లోగో తయారు చేస్తున్నాం..కేంద్రం ఏర్పాటు చేసిన ఏ ఐ సమావేశం నిర్వహణ పైన కొన్ని విమర్శలు వచ్చాయి..కానీ తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ అందరి దృష్టిని ఆకర్షించిందన్నారు. ప్రణాళికా బద్ధంగా జీహెచ్ ఎం సీ ని మూడు కార్పొరేషన్ లు గా విభజించాం..కోర్ అర్బన్ రీజియన్ లో చేపట్టాల్సిన కార్యాచరణ పైన అధికారులు దృష్టి పెట్టాలి..ప్యూర్ అర్బన్ రీజియన్ 10 వేల చదరపు కిలో మీటర్ల పరిధిలో విస్తరించి ఉంది..ఇక్కడ మాన్యుఫాక్చరింగ్ రంగం విస్తరించాలి. పారిశ్రామికీకరణ లో తెలంగాణ దేశానికి ఆదర్శంగా ఉండాలని అంటూ.. దీనిపైన అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సేవా రంగంలో వస్తున్న పెను మార్పులు గమనంలోకి తీసుకోవాలి..శాఖలపైన ప్రతి ఒక్కరికి సంపూర్ణ అవగాహన ఉండాలి.. శాఖలల్లో పనిచేస్తున్న ఉద్యోగులు,అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జాబితా సిద్ధం చేయాలి..ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండడానికి వీలు లేదు.. ప్రతి శాఖకు సొంత భవనం ఉండాలి..బడ్జెట్ ప్రతిపాదన లో వీటిని చేర్చాలి. కేంద్ర ప్రాయోజిత పథకాల పైన ప్రతి శాఖ దృష్టి పెట్టాలి..అధికారులు అప్రమత్తం గా ఉండాలి సర్వీస్ సెక్టార్ ను పూర్తి గా ప్రక్షాళన చేయాలి..ఆన్‌లైన్ విధానంలో అన్ని పనులు జరిగేలా చూడాలని సూచించారు. ఫైల్ విధానం ఉండాలి..నిర్ణీత సమయంలో ఫైల్ క్లియర్ కావాల్సిందే. వివిధ కంపెనీ లతో చేసుకున్న ఒప్పందాలు ,పెట్టుబడులు గ్రౌండ్ కావాలి.. పాత కాలం సర్వర్ లను అప్డేట్ చేసుకోవాలి..

సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలి..ఇందులో సాంకేతికత ను వినియోగించుకోవాలి

నిజమైన లబ్దిదారులకు సంక్షేమ పథకాలు అందాలి. 30 వేల ఎకరాల్లో నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ పైన దృష్టి పెట్టాలి..ఫ్యూచర్ సిటీ దేశ ఆర్థిక స్థితిని ని మార్చబోతోంది..మూసీ నది పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నాం ..ఇక్కడ వచ్చే మార్పులను ప్రజలకు వివరించాలి.డిజిటల్ గవర్నెన్స్ పైన దృష్టి పెట్టాలి..నాణ్యమైన విద్య ను అందించడం పైన దృష్టి సారించాలి..వంద నియోజకవర్గాలలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభించుకోబోతున్నాం .. ప్రభుత్వ విద్యను ప్రక్షాళన చేస్తాం..ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్య సేవలు మెరుగుపడాలి..ప్రాంతాల వారీగా మెడికల్ డేటా తయారు చేయాలి.ప్రతి సెక్రటరీ తమ శాఖ లల్లో బెస్ట్ ప్రోగ్రామ్ ను డిజైన్ చేసుకోవాలి.. మార్చి 6 నుంచి 99 రోజుల ప్రణాళిక జూన్ 12 వరకు జరగబోతుంది.. జూన్ 2 వరకు ప్రతి ఆఫీస్ పరిశుభ్రంగా కావాల్సిందే.. జూన్ 2 తెలంగాణ కు పండుగ..పండుగ ను అంతా ఘనంగా జరుపుకోవాలి. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ప్రతి అధికారి ఈ కార్యక్రమం లో పాల్గొనాలి..మినహాయింపు లు ఉండవు శాఖ ల మధ్య సమన్వయం ఉండాలి.. ప్రతి ఎన్నికలో ప్రజలు నాకు కావాల్సిన బలాన్ని ఇచ్చారు.. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మనం ప్రజలకు మంచి చేయాల్సి ఉందని సిఎం రేవంత్ సూచించారు.

# మీ ప్రభుత్వంపై తిరగబడండి

**మీకు అండగా మా సైనిక శక్తి ఉంటుంది**

**ఇరాన్ ప్రజలకు ట్రంప్ సందేశం**

వాషింగ్టన్: అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై చేపట్టిన దాడులను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధ్రువీకరించారు. ఎన్ని హెచ్చరికలు చేసినా అణుకేంద్రాల పునర్నిర్మాణం, క్షిపణులను అభివృద్ధి చేస్తుండటంతో ఇరాన్‌పై భారీ సైనిక చర్య చేపట్టామని ప్రకటించారు. ఇరాన్ ప్రజలకు బహిరంగంగా తొలిసారి కీలక సందేశం ఇచ్చారు. దశాబ్దాలుగా అణచివేతకు గురవుతున్న ఇరాన్ ప్రజలకు ఇది విమక్తి కల్పించే సందర్భమని అన్నారు. 'ఇరాన్ ప్రజలకు విముక్తి కలిగించే సందర్భం వచ్చింది. తరతరాలకు మీకు లభించే ఏకైక గొప్ప అవకాశం ఇదే కావచ్చు. అమెరికా పూర్తి సైనిక శక్తితో అండగా నిలుస్తుంది. మేము పని పూర్తి చేసే సమయానికి మీ ప్రభుత్వాన్ని మీరు స్వాధీనం చేసుకోవాలి' అని ఇరాన్ ప్రజలకు ట్రంప్ పిలుపునిచ్చారు. ఇరాన్ భద్రతా దళాలను ఉద్దేశించి మాట్లాడుతూ, తక్షణమే వారు ఆయుధాలు విడిచిపెట్టాలని, అలాచేస్తే వారికి రక్షణ కల్పిస్తామని, తిరగబడితే మరణం తప్పదని హెచ్చరించారు. ఈ చారిత్రక ఘట్టంలో ఇరాన్ ప్రజలకు అమెరికా పూర్తి సైనిక శక్తితో అండగా ఉంటుందన్నారు. గతంలో ఏ అమెరికా అధ్యక్షుడు ఈ తరహాలో స్పందించేందుకు ముందుకు రాలేదన్నారు. కాగా, 'అపరేషన్ షీల్డ్ ఆఫ్ జూడా' పేరుతో ఇరాన్‌పై ఇజ్రాయెల్ శనివారంనాడు క్షిపణి దాడులు జరిగింది. ఈ దాడులలో రాజధాని నగరమైన టెహ్రాన్‌లో పలు ప్రాంతాలు దద్దరిల్లాయి. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ కార్యాలయం సమీపంలో దాడులు జరగడంతో కలకలం రేగింది. ఇరాన్ ప్రతిదాడికి దిగొచ్చంటూ ఇజ్రాయెల్ తన పౌరులను హెచ్చరించింది. ముందస్తుగా ఇరాన్, ఇజ్రాయెల్‌లు తమ గగనతలాలను మూసివేశాయి. మరోవైపు, ఇరాన్‌లోని భారతీయ పౌరులకు అక్కడి ఇండియన్ ఎంబసీ కీలక సూచనలు చేసింది. అప్రమత్తంగా ఉండాలని, అనవసర ప్రయాణాలు పెట్టుకోవద్దని, ఇళల్లోనే ఉండాలని సూచించింది. అధికారుల సూచనలను తూచా తప్పకుండా పాటించాలని కోరింది.

# ఇరాన్‌పై బాంబుల వర్షం

**సురక్షిత ప్రాంతానికి ఖమేనీ తరలింపు**

టెహ్రాన్: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా యుద్ధం మొదలుపెట్టాయి. 'ఆపరేషన్ షీల్డ్ ఆఫ్ జూడా' పేరుతో ఇజ్రాయెల్ క్షిపణులు, బాంబులతో ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై శనివారంనాడు విరుచుకుపడింది. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ కార్యాలయం సమీపంలో దాడులు జరిగాయి. ఖమేనీ, అధ్యక్ష భవనాలే టార్గెట్‌గా ఈ మెరుపు దాడులు జరిగినట్టు చెబుతున్నారు. దాడుల సమయంలో ఖమేనీ టెహ్రాన్‌లో లేరని తెలుస్తోంది. ఇప్పటికే ఆయనను సురక్షిత ప్రాంతానికి తరలించినట్టు చెబుతున్నారు. అయితే ఆయనను ఎక్కడకు తరలించారు, ఎప్పుడు తరలించారనే వివరాలు వెల్లడి కాలేదు. ఖమేని ఇరాన్ వదిలి వెళ్లాలని, లేదంటే విడిచిపెట్టేది లేదని ట్రంప్ ఇప్పటికే హెచ్చరించారు. దీంతో ఖమేనీ లక్ష్యంగానే అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులు మొదలుపెట్టినట్టు కథనాలు వెలువడుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా బలగాలు పెద్దఎత్తున సైనిక చర్యకు దిగినట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇందుకు సంబంధించిన 8 నిమిషాల వీడియోను ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. వాషింగ్టన్ సైనిక చర్యను ఆయన సమర్థించుకున్నారు. ఇరాన్ పాలకుల నుంచి అమెరికా ప్రజలకు ఉన్న ముప్పును తప్పించేందుకే సైనిక చర్యలకు దిగామన్నారు. ఇరాన్ కార్యక్రమాలు అమెరికాకు, అమెరికా బలగాలకు, విదేశాల్లోని తమ స్థావరాలు, ప్రపంచంలోని తమ మిత్రదేశాలకు ముప్పుగా ఉన్నాయన్నారు.

# చెంపదెబ్బ...గోడదెబ్బ !

దేశంలో రెండు అసాధారణమైన కేసులు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. న్యాయవ్యవస్థ గట్టిగా నిలబడేలా తీసుకున్న చర్యలు ఇప్పుడు రాజకీయ నాయకుల కళ్లు తెరిపిస్తాయా లేదా అన్నది చూడాలి.ముందుగా ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు లిక్కర్ స్కామ్‌పై ఇచ్చిన తీర్పు ఒకటయితే..ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాల్లో న్యాయవ్యవస్థపై అచ్చేసిన పాఠ్యాంశం మరొకటి. ఈ రెండు కేసుల్లో న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పులు లేదా ఆదేశాలు నేరుగా కేంద్రాన్ని ప్రశ్నించాయి. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిలదీసాయి. ఇంతకన్నా ఘోరం మరోటి ఉండదు. ఎందుకంటే తమ చేతుల్లో ఉన్న అధికారాన్ని గుప్పిట పెట్టుకుని దర్యాప్తు సంస్థల ద్వారా లిక్కర్ కేసును అల్లిన తీరు చూస్తే ఇడి, సిబిఐల పరువు పోయింది. సిబిఐ అధికారిపై విచారణ చేయాలని ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు జడ్జి చేసిన వ్యాఖ్యలు చూస్తే కేంద్రం సిగ్గుతో తలదించుకోవాలి. ఇక్కడ సిబిఐ ఇంత నిర్లక్ష్యంగా ఓ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసినందుకు బాధపడాలి. అంటే దాని ప్రతిష్టను అదే దిగజార్చుకుంది. కనీస సమాచారం, దానికి తగ్గ అవసరమైన సాక్ష్యాలు లేకుండా ఓ కేసును గాలిలో మేడలు కట్టినట్లుగా అల్లడం వెనక ఎంతటి నిర్లక్ష్యం ఉందో తెలియచేసింది. రాజ్యాంగ పదవిలో ఉన్న సిఎం కేజ్రీవాల్‌ను జైలులో పెట్టారు. ఉపముఖ్యమంత్రి సిసోడియాను జైలులో పెట్టారు. అంటే ఎంతటి దుర్మార్గానికి సిబిఐ, ఇడిలు ఒడిగట్టాయన్నది తేలిపోయింది. ఇదే విషయాన్ని జడ్జి ప్రశ్నించారు. నిజంగానే లిక్కర్ పాలసీ కేసు అన్నది ఓ అభూత కల్పన కేసు. అందులో ముడుపులు ముట్టాయనడానికి ఆధారాలు లేవు. ఈ కేసుతో సిబిఐ తన తీరును మార్చుకోవాలి. పక్కా సమాచారంతో కేసులను చేపట్టాలి. తద్వారా పోయిన ప్రతిష్టను ఇనుమడించేలా చేసుకోవాలి. ఇది సిబిఐ పరువే కాదు, దేశానికి సంబంధించి ప్రతిష్ట కూడా ఇందులో దాగి ఉంది. సిబిఐ సరిగా పనిచేస్తేనే, ప్రజలకు నమ్మిక ఉంటుంది. ఈ కేసులో ఆధారాలు ఉంటేనే హైకోర్టుకు వెళ్లడం మంచిది. అక్కడా భంగపడేకన్నా ఆధారాలు, సాక్ష్యాలను సేకరించాలి. ప్రాథమికి సమాచారం ఉంటేనే ముందుకు నడవాలి. రాజకీయ కక్షసాధింపులకు పాల్పడే కేసుల నుంచి సిబిఐ, ఇడిలలను దూరంగా ఉంచడం మంచిది. నిజానికి కెసిఆర్ హయాంలో జరిగిన అవినీతిపై కేసులు లేవు. జగన్ హయాంలో జరిగిన ఆర్థిక అవతవకతలపైనా కేసులు లేవు. ఇలాంటి వారి వల్ల ప్రజాధనం దుర్వినియోగం అయ్యింది. వీటిపై చర్యలు తీసుకుంటే రాష్ట్రాల్లో పాలకుల్లో భయం ఉంటుంది. ఇకపోతే మరో కేసులో సుప్రీం చీఫ్ జస్టిస్ చేసిన వ్యాఖ్యలు కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపాయి. జాతీయ, విద్యా పరిశోధన, శిక్షణ మండలి ఎన్‌సిఇఆర్‌టి ప్రచురించిన ఎనిమిదో తరగతి సాంఘికశాస్త్రంలో 'కరప్షన్ ఇన్ ది జ్యూడిషియరీ' అనే పాఠ్యాంశం తీవ్ర వివాదమైంది. సుప్రీంకోర్టు ఈ అంశాన్ని సూమోటోగా విచారణకు



తీసుకోవడమే గాక.. ఆ సందర్భంగా ఆగ్రహంతో స్పందించిన తీరు, సిజెఐ చేసిన వ్యాఖ్యలు దేశాన్ని కుదిపేశాయి. 'న్యాయవ్యవస్థ అధికారాన్ని అణచివేసేలా, గౌరవాన్ని కించపర్చేలా, ఉద్దేశ్య పూర్వకంగా చేసిన కుట్రగా ఇది కనిపిస్తోంది. దీనిని పట్టించుకోకుండా వదిలేస్తే ప్రజలు, యువత మనసుల్లో న్యాయవ్యవస్థ పవిత్రత దెబ్బతినే అవకాశం ఉంది.' అని విచారణ సందర్భంగా సిజెఐ అన్న వ్యాఖ్యలు అక్షర సత్యాలు. జవాబుదారీతనం ఏర్పడేంతవరకు ఈ వ్యవహారాన్ని మేం వదలిబెట్టం. దీని వెనుక ఎవరున్నారో మేం తెలుసుకోవాలనుకుంటున్నామని సిజెఐ అనడం చూస్తుంటే..ఎంతటి నిర్లక్ష్యం ఉందో తేటతెల్లం అయ్యింది. ఈ వ్యవహారంతో కేంద్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానానికి బేషరతుగా క్షమాపణలు చెప్పవలసి వచ్చింది. ఆ చాప్టర్లను ఇద్దరు వ్యక్తులు రూపొందించారని, వారు యుజిసి లేదా మరే మంత్రిత్వ శాఖతోనూ కలిసి పనిచేయడం లేదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వివరణ ఇచ్చారు.ఆ పాఠ్యాంశాన్ని ముద్రించిన ఎనిమిదో తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకాన్ని పూర్తిగా నిషేధించాలని, ఇప్పటికే ప్రచురితమైన పుస్తకాలను వెనక్కి తీసుకోవాలని ధర్మాసనం ఆదేశించడం ద్వారా ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని గట్టిగా నిలదీసినట్లు అయ్యింది. అయితే 8వ తరగతి పాఠ్యాంశం వంటిది హఠాత్పరి ణామం కాదు. గత దశాబ్ద కాలంగా ఎన్‌సిఇఆర్‌టి, ఇతర కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సంస్థల చర్యలు తరచు వివాదాస్పదంగా మారుతున్న విషయం అందరికీ తెలిసిందే! పాఠ్యాంశాల్లో కొన్ని తొలగింపులు, అర్థరహిత మైన చేర్పులతో మీడియాలో పతాక శీర్షికల్లో వస్తూనే ఉన్నాయి. ఆయా సందర్భాల్లో చరిత్రకారులు, సామాజిక శాస్త్రవేత్తలూ వాటిని ఎత్తిజూపి ప్రజలు, ప్రభుత్వ దృష్టికి తీసుకొస్తున్నారు. ఇప్పుడు నేరుగా న్యాయ వ్యవస్థనే టార్గెట్ చేయడం, సుప్రీం ధర్మాగ్రహంతో కేంద్రం ఆత్మరక్షణలో పడింది. నేరుగా ప్రధానమంత్రి కార్యాలయమే రంగంలోకి దిగి నష్ట నివారణ చర్యలు చేపట్టవలసి వచ్చింది. ఈ రెండు వ్యవహారాల్లో కేంద్రం నేరుగా దొరికి పోయింది. కేజ్రీవాల్‌ను అణచివేసే కుట్ర జరిగిందన్న ఇక్కడ తెలిసిపోయింది. అన్నా హజారే చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమంలో పుట్టుకుని వచ్చిన కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రి అయ్యారు. పంజాబ్‌లో పాగా వేశారు. దేశంలో అనేక చోట్ల ఉనికి చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయనను అవినీతి ముద్రతో అణివేసే ప్రయత్నం జరిగిందన్న వాదనలు వచ్చాయి. తెలంగాణలో కెసిఆర్ తనయ కవితను కూడా ఇందులో చేర్చారు. నిజానికి ఈ కేసు బలంగా ఉంటే కోర్టు ఇంత తీవ్రంగా వ్యాఖ్యలు చేసివుండేది కాదు. రాజకీయంగా తీసుకునే నిర్ణయాలకు సిబిఐ, ఇటి లాంటి వ్యవస్థలను దుర్వినయోగం చేయడం తగదు. ఇప్పటికైనా కేంద్రం తగు జాగ్రత్తలు తీసుకుని ప్రజలకు మేలుజరిగే మంచి పనులపై దృష్టి సారించాలి. అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలి. అందుకు సమర్థవంతులైన అధికారులను నియమించుకోవాలి.

# మరోమారు భగ్గుమన్న పుత్తడి ధరలు

## పెళ్లిళ్ల సీజన్ కావడంతో సామాన్యుల బెంబేలు

న్యూఢిల్లీ: దేశంలో బంగారం, వెండి ధరలు సామాన్యుల అంచనాలకు అందని విధంగా మారుతున్నాయి. రెండు రోజుల పాటు దాదాపు స్థిరంగా కొనసాగిన ధరలు శనివారం ఒక్కసారిగా భగ్గుమన్నాయి. దేశంలో బంగారం ధర సగటున రూ.3 వేల మేర పెరగ్గా వెండి ధర కూడా చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఎగబాకింది. అసలే పెళ్లిళ్ల సీజన్ కావడంతో సామాన్యులకు ధరలు కంగారు పెట్టిస్తున్నాయి.



గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, శనివారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ.1,64,730లకు చేరుకుంది. నిన్నటి ముగింపు ధరతో పోలిస్తే ఏకంగా రూ.3,160ల మేర పెరిగింది. ఇక 22 క్యారెట్ పసిడి ధర కూడా రూ.2,900ల మేర పెరిగి రూ.1,51,000లకు చేరుకుంది. నగరంలో వెండి ధర కూడా రూ.5 వేల మేర పెరిగింది. ప్రస్తుతం కిలో వెండి రూ.3 లక్షలుగా ఉంది. చెన్నైలో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర గరిష్ఠంగా రూ.1,65,820కు చేరింది. ముంబై, కర్ణాటక, బెంగళూరు నగరాల్లో మేలిమి బంగారం ధర రూ.1,64,730గా ఉంది. ఢిల్లీలో రూ.1,64,880ల వద్ద కొనసాగుతోంది. ఇక 22 క్యారెట్ ఆర్నమెంటల్ బంగారం ధర (10 గ్రాములు) చెన్నైలో రూ.1,52,000గా, ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ.1,51,000 వద్ద కొనసాగుతోంది. నగరాల వారీగా వెండి ధరలను పరిశీలిస్తే.. చెన్నైలో కిలో వెండి ప్రస్తుతం రూ.3 లక్షలకు చేరుకుంది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ.2.95 లక్షల వద్ద కొనసాగుతోంది.

# తిరుపతి ఎస్వీ జూపార్క్‌కు అరుదైన వన్యప్రాణులు

## పరస్పర మార్పిడితో జంతువుల రాక

తిరుపతి: తిరుపతి ఎస్వీ జూపార్కుకు త్వరలో అరుదైన వన్యప్రాణులు రానున్నాయి. విశాఖ జూపార్కు, హైదరాబాదు జూపార్కు, చెన్నైలోని క్రొకోడైల్ బ్యాంకు ట్రస్టు, గుజరాత్ రాష్ట్రం జాంనగర్‌లోని గ్రీన్స్ జువాజికల్ రెస్క్యూ అండ్ రిహాబిటేషన్ సెంటర్ నుంచి మొత్తం 61 వన్యప్రాణులు తిరుపతికి రానున్నాయి. పరస్పర వన్యప్రాణి మార్పిడి విధానం ద్వారా వీటిని తెప్పించనున్నట్లు ఇక్కడి జూ అధికారులు చెప్పారు. తిరుపతినుంచి గరియల్-2, ఇండినగ్ గౌడ్-2, జపనీస్ కోయల్ -4, మస్కోవి డెక్ -4, గే పిలికాన్ -2, వైటఖ్ ఈబీస్ 2 హైదరాబాద్ లోని నెహ్రూ జులాజికల్ పార్కుకు పంపిస్తారు. అక్కడినుంచి మగ్గర్ క్రోకోడైల్స్ -4, ఇండియన్ మౌస్ డీర్-6, రింగ్ నెక్కుడ్ పీసెంట్ -2, గో÷-డలెన్ పీసెంట్-2, సిల్వర్ పీసెంట్ -1, రెడ్ జంగిల్ ఫోవల్ -2, జంధ్యాకోనూరే 2 ఇక్కడికి రానున్నాయి. మద్రాస్ క్రొకోడైల్ బ్యాంకు ట్రస్టు నుంచి మొసళ్లు-5, ఉప్పునీటి మొసళ్లు 2, ఎల్లో అనకొండ-9 ఎస్వీ జూపార్కుకు రానున్నాయి. విశాఖలోని ఇందిరాగాంధీ జువాజికల్ పార్కు నుంచి ఒక తెల్లపుల్లి ఎస్వీ జూపార్కుకు రానుండగా ఇక్కడున్న తెల్లపులిని వారికి పంపిస్తారు. రెండు అడవికుక్కలు, ఒక తోడేలు, రెండు జింకలు, బూడిదరంగు అడవికోళ్లు రెండు విశాఖ జూకు పంపించనున్నారు. దానికి బదులుగా అక్కడి నుంచి ఒక తోడేలు, రెండు అడవికుక్కలు, రెండు అడవిపిల్లులు, రెండు నీల్‌గై, నాలుగు గ్రీన్ ఇగ్వనాలను తిరుపతి జూపార్కుకు అందజేయనున్నారు. జామ్‌నగర్‌కు తెల్లపులి ఒకటి, ఇండియన్ గౌర్ రెండు, బ్లాక్ బక్-10, సాంబార్-10, బార్కింగ్ డీర్-2, మస్క్వేడక్-2, జాగ్వర్ ఒకటి అందజేస్తారు. దీనికి బదులుగా జీబ్రాలు 4, బ్లాక్ పాంథర్ రెండు, జిరాఫీలు రెండు, జాగ్వార్లు రెండు, రెడ్ నెక్కుడు వాలాబీ నాలుగు తిరుపతి ఎస్వీ జూపార్కుకు అందజేస్తారు.

# విశాఖ శారదాపీఠం ఆలయం కూల్చివేస్తే అడ్డుకుంటాం

### చట్టబద్ధంగా కేటాయించిన రెండెకరాలు లాగేసుకుంటారా

### దేవాలయాలు, మఠాలను మింగాలన్న ఆలోచన ఎందుకు

### కోకాపేట శారదాపీఠం భూముల స్వాధీనంపై హరీష్ ఆగ్రహం



హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్లతో పాటు ఇప్పుడు దేవాలయాలు, మఠాలను సైతం కూల్చేందుకు కుట్రలు చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ల హరీశ్ రావు మండిపడ్డారు. కోకాపేట్ నియోపోలిస్‌లోని విశాఖ శారద పీఠం, రాజశ్యామల అమ్మవారి ఆలయాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు అకస్మాత్తుగా చుట్టుముట్టి ఖాళీ చేయాలంటూ భయాందోళనలకు గురిచేస్తున్న నేపథ్యంలో హరీశ్‌రావు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఆలయాన్ని సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వినాశకాలే విపరీత బుద్ధి అన్నట్లు రేవంత్ రెడ్డి పాలన తయారైందని హరీశ్‌రావు అన్నారు. అడ్డగోలు వ్యవహారాలకు, అక్రమాలకు పాల్పడుతున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా దేవాలయాలు, మఠాలను కూడా కూల్చే స్థాయికి దిగజారిందని విమర్శించారు. 2019లో కేసీఆర్ ప్రభుత్వంలో కోకాపేట సర్వే నెంబర్ 240లో విశాఖ శారద పీఠానికి చట్టబద్ధంగా క్యాబినెట్ ఆమోదంతో రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించామని తెలిపారు. పీఠం నిర్వాహకులు ప్రభుత్వానికి 1.05 కోట్లు చెల్లించి రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నారని పేర్కొన్నారు. అలాగే హెచ్ఎండీఏ కు రూ. 23 లక్షలు చెల్లించి అనుమతులు, విద్యుత్ కనెక్షన్ అన్నీ తీసుకున్నారని చెప్పారు. ఇక్కడ అద్భుతమైన శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారి దేవాలయం, గోశాల, నిత్య అన్నదాన సత్రం, వేద పాఠశాల నిర్మించారని అన్నారు. హైకోర్టు న్యాయమూర్తులు, అధికారుల సమక్షంలో పెద్ద స్వామిజీ చేతుల మీదుగా ప్రతిష్ఠా కార్యక్రమం జరిగిందని గుర్తుచేశారు. అప్పటి నుంచి ఇక్కడ నిత్య పూజలు జరుగుతున్నాయన్నారు. హైదరాబాద్‌లో శారద పీఠం కింద 16 దేవాలయాలు, లక్షలాది మంది భక్తులు ఉన్నారని తెలిపారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తా అంటూ.. కేసీఆర్ కట్టిన గుళ్లు, గోపురాలు, మఠాలను కూల్చడమేనా రేవంత్ రెడ్డి ఉద్దేశమని హరీష్ రావు మండిపడ్డారు. హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చావు, ఖమ్మంలో ఇళ్లు కూల్చి 800 మందిని రోడ్డున పడేశావు. నీ పాలనలో అంతా కూల్చడమే తప్ప, నిర్మాణం లేదా అని సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటర్ వర్క్స్ ఊఓచాః కోసం ఈ స్థలం తీసుకుంటున్నామని ప్రభుత్వం చెబుతోందని తెలిపారు. వాటర్ వర్క్స్ కట్టాలంటే ఈ దేవాలయం స్థలమే దొరికిందా.. సరిగ్గా ఈ ఆలయానికి రోడ్డు అవతలే సర్వే నెంబర్ 239, 240 లలో 17 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది కదా, వాటర్ వర్క్స్ అక్కడ కట్టుకోవచ్చు కదా అని ప్రశ్నించారు. ఆ 17 ఎకరాల భూమిని రేవంత్ రెడ్డి తన అల్లుడికి, మేనల్లుళ్లకు, వాళ్ల అనుచరులకు భాగ్యలక్ష్మి మైన్స్ అండ్ మినరల్స్ అక్రమంగా కట్టబెట్టారని తెలిపారు. సమాచార హక్కు చట్టం కింద నేనే స్వయంగా అడిగితే ప్రభుత్వం ఇచ్చిన జవాబు ఇది అని తెలిపారు.. 10 ఎకరాలు ఇస్తే వాళ్లు 17 ఎకరాలు కబ్జా పెట్టారని పేర్కొన్నారు. ఓపెన్ ఆక్షన్ వేస్తే ప్రభుత్వానికి వందల కోట్లు వచ్చేవి. కానీ లోపల లోపల నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టి ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని మండిపడ్డారు. హెచ్ఎండీఏ నిబంధనల ప్రకారం ఓఆర్ఆర్‌కు కిలోమీటర్ లోపల ఎలాంటి క్రషర్లు ఉండకూడదు.. కానీ రేవంత్ రెడ్డి తన అల్లుడి కోసం ఇక్కడ ఏకంగా 5 రెడీమిక్స్ ప్లాంట్లు, క్రషర్లు పెట్టించారని హరీశ్‌రావు తెలిపారు. పక్కన ఉన్న బిల్డర్లంతా తన అల్లుడి దగ్గరే కంకర కొనాలని,

లేకపోతే అనుమతులు ఇవ్వమని బెదిరిస్తూ దందా చేస్తున్నారని పేర్కొన్నారు. అల్లుడికి వ్యాపారం చేసుకోవడానికి 17 ఎకరాలు ఇస్తావు కానీ.. హిందూ ధర్మాన్ని ప్రచారం చేసే శారద పీఠానికి ఉన్న రెండు ఎకరాలను మాత్రం లాక్కుని కూలుస్తావా అని మండిపడ్డారు. భక్తుల మనోభావాలను దెబ్బతీయడమే నీ ధర్మమా.. తక్షణమే ఆ అక్రమ క్రషర్లను క్యాన్సిల్ చేయాలని డిమాండ్ చేశారు. కనీసం నోటీసులు ఇవ్వకుండా నిన్న రాత్రి 11:30 గంటలకు వందలాది మంది పోలీసులు, ఎంఆర్వోలు వచ్చి ఆలయం వద్ద పీఠాధిపతిని, నిర్వాహకులను భయభ్రాంతులకు గురిచేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యాబినెట్ లో నిర్ణయం తీసుకునే ముందు పీఠాధిపతులతో మాట్లాడే కనీస సంస్కారం ఈ ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. ఉదయం నేను ఇక్కడికి వస్తున్నానని తెలియగానే పోలీసులు, ఆర్ఐ, తహసీల్దార్ అందరూ పారిపోయారని హరీశ్‌రావు తెలిపారు. దొంగల్లా దాక్కోవాల్సిన

అవసరం పోలీసులకు ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఉదయం స్వాములు పూజలు చేస్తుంటే పోలీసులు అడ్డుకున్నారని.. దేవాలయంలో ఏళ్ల తరబడి జరుగుతున్న పూజలను ఆపే హక్కు, ధైర్యం రేవంత్ రెడ్డికి ఎవరిచ్చారని నిలదీశారు. స్వామిజీ గారు వాగ్వాదానికి దిగాక అరగంట తర్వాత పూజకు అనుమతించారని తెలిపారు. కేసీఆర్ ఆనవాళ్లని చెప్పి రైతుబంధు, కేసీఆర్ కిట్, ఫీజు రీయింబర్స్మెంట్ బంద్ చేసినావు.. ఇప్పుడు గుళ్లను కూడా వదులుతలేవని సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు మండిపడ్డారు. దేవుని మీద పడ్డవాడు ఎవడూ

బాగుపడలేదు.. నీకేదో పోయేగాలం దాపురించింది, ఆ దేవుడి శాపం నీకు తప్పక తగులుతుందని అన్నారు. క్యాబినెట్‌లో ఉన్న మంత్రి శ్రీధర్ బాబు దయచేసి ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెచ్చి ఈ దేవాలయాన్ని, మఠాన్ని కూల్చకుండా కాపాడాలని కోరారు. లేనిపక్షంలో ఈ దేవాలయ పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ భక్తులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన భూమిని కాపాడుకునే బాధ్యత మాదే అని.. ఎంత దూరమైనా పోరాడుతాం తప్ప రాజశ్యామల ఆలయాన్ని కూల్చనివ్వమని స్పష్టం చేశారు.

# ఎపిలో జోరుగా పెన్షన్ల పంపిణీ

### విజయనగరంలో సిఎం చంద్రబాబు హాజరు

### పాలకొల్లులో మంత్రి నిమ్మల పంపిణీ

అమరావతి: ఏపీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ శరవేగంగా సాగుతోంది. మార్చి1 ఆదివారం సెలవు కావడంతో ఒకరోజు ముందుగానే అంటే శనివారం పింఛన్లను పంపిణీ చేపట్టారు. ఉదయం 11 గంటల నాటికి సుమారు 82 శాతం మేర పింఛన్లు అందజేశారు. ప్రభుత్వం 62.76 లక్షల మంది లబ్దిదారులకు రూ. 2,725 కోట్లు విడుదల చేసింది. ఇప్పటి వరకు 51.86 లక్షల మందికి పింఛన్లు పంపిణీ అయ్యాయి. స్వర్ణవార్డు, స్వర్ణగ్రామ సిబ్బంది.. లబ్దిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి నగదుగా అందజేస్తున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గం రావివలస గ్రామంలో అక్కడ లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేపట్టారు. మరోవైపు పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో మంత్రి నిమ్మల రామానాయుడు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. వృద్ధురాలికి పింఛన్ అందజేసి ఆమె యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలకు జగన్ మోహన్ రెడ్డి, వైసీపీ ఎమ్మెల్యేలు ముఖం చాటేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. అసెంబ్లీ నుంచి ఎస్కేప్, శాసనమండలికి వాకౌట్, రోడ్డుపై రప్పా రప్పా సంస్కృతి వైసీపీదని విమర్శించారు. 2029లో అధికారంలోకి వస్తే

రాక్షసత్వం ప్రదర్శిస్తా మన్న వైసీపీ వ్యాఖ్యలను మంత్రి ఖండించారు. మానవత్వంతో పనిచేసే కూటమి ప్రభుత్వమా లేక రాక్షసత్వం గల వైసీపీనా అని ప్రజలు తేడా బేరీజు వేసుకోవాలన్నారు. జగన్.. ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకోకుండా తప్పిదాలు చేస్తున్నారని తెలిపారు. పురాణకాలంలో యజ్ఞాలను అడ్డుకున్న రాక్షసుల్లా నేడు అభివృద్ధిని, మంచి కార్యక్రమాలను అడ్డుకునే దుష్టశక్తిగా వైసీపీ తయారైందంటూ మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యలు చేశారు.

# దేశవ్యాప్తంగా హెచ్‌పివి వేక్సినేషన్

### చీపురుపల్లి సిహెచ్‌సిలో ప్రారంభించిన చంద్రబాబు

విజయనగరం: దేశవ్యాప్తంగా హెచ్‌పివి వేక్సినేషన్ జరుగుతోన్న వేళ ఎపి రాష్ట్రంలోనూ టీకా కార్యక్రమం కొనసాగుతోంది. శనివారం విజయనగరం జిల్లాలోని చీపురుపల్లి సిహెచ్‌సిలో హెచ్‌పివి వేక్సినేషన్ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ ..గర్భాశయ కేన్సర్ రాకుండా బాలికలు ఈ వ్యాక్సిన్స్ వేసుకోవాలని పిలుపునిచ్చారు. ఒకసారి వ్యాక్సిన్ వేసుకుంటే జీవితాంతం రక్షణ ఉంటుందని చెప్పారు. బాలికలు, వారి తల్లితండ్రులతో మాట్లాడి యోగక్షేమాలను తెలుసుకున్నారు. చీపురుపల్లి సిహెచ్‌సి పరిశుభ్రంగా ఉందని సిఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి అనిత, వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# లండన్ అగ్నిప్రమాదంలో నిజామాబాద్ యువకుడు మృతి

నిజామాబాద్: లండన్‌లోని క్రొయిడాన్ ప్రాంతంలో మూడు రోజుల క్రితం జరిగిన అగ్ని ప్రమాదంలో ఎపి కి చెందిన గొంతి అభిషేక్ ప్రాణాలు కోల్పోగా, తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్న నిజామాబాద్‌కు చెందిన సాయి శ్రీకర్‌ను వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా నిర్థారించారు. ఒకే రూమ్‌లో ఉంటున్న వీరు ఎంబీఏ పూర్తిచేసి పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తున్నట్లు సమాచారం. అయితే, ఈ అగ్నిప్రమాదం నుంచి తప్పించుకున్న మరో విద్యార్థి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. లండన్ డుప్పాస్ హిల్స్ టెర్రాస్‌లోని రెండు అంతస్తుల నివాసంలో రెండు రోజుల క్రితం గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. గ్రౌండ్ ఫ్లోర్ నుంచి మొదటి అంతస్తుకు మంటలు, దట్టమైన పొగ వ్యాపించడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో సాయి శ్రీకర్ అవయవాలను దానం చేసేందుకు అంగీకరించినట్లు నిజామాబాద్‌లోని శ్రీనగర్ కాలనీలో నివాసముంటున్న అతడి తల్లిదండ్రులు వెల్లడించారు.



# యాక్షన్ డ్రామా

తెలుగు, తమిళం చిత్రాలతో మంచి గుర్తింపు పొందిన యంగ్ హీరో సందీప్ కిషన్ మరో ఆసక్తికర ప్రాజెక్ట్‌తో ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాడు. 'స్నేహగీతం', 'ప్రస్థానం' వంటి చిత్రాలతో ప్రేక్షకులకు దగ్గరైన ఆయన, విభిన్న కథలను ఎంచుకునే నటుడిగా పేరుపొందారు. కెరీర్ ప్రారంభంలో దర్శకుడు గౌతమ్ మీనన్ తెరకెక్కించిన 'వారణం ఆయిరం' చిత్రానికి సహాయ దర్శకుడిగా పనిచేసిన సందీప్, తర్వాత హీరోగా తన ప్రయాణాన్ని ప్రారంభించారు. చెన్నైలో జన్మించిన ఆయన లయోలా కాలేజీలో చదువు పూర్తి చేసి సినీరంగంలో అడుగుపెట్టారు. ప్రముఖ ఛాయాగ్రాహకులు ఛోటా కె.నాయుడు, శ్యామ్ కె.నాయుడు ఆయన బంధువులు కావడం విశేషం. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, తెనాలి రామకృష్ణ బీఎ బీఎల్ వంటి చిత్రాలతో మంచి హిట్లు అందుకున్న సందీప్ కిషన్ ఇటీవల ప్రేక్షకుల్ని పెద్దగా ఆకట్టుకోలేకపోతున్నాడు.

ఇటీవల ఆయన సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశపరచడంతో మార్కెట్ కొంత తగ్గిందనే ట్రేడ్ వర్గాలు చెబుతున్నా కథల ఎంపికలో కొత్తదనం కోసం మాత్రం ప్రయత్నిస్తూనే ఉన్నాడు. మంచి కమ్‌బ్యాక్ కోసం ఎదురుచూస్తున్న సందీప్... టాలెంటెడ్ దర్శకుడు కృష్ణ చైతన్య దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం "పవర్ పేట"లో నటిస్తుండటం సినీ వర్గాల్లో ఆసక్తి పెరిగింది. 'రౌడీ ఫెలో', 'చల్ మోహన్ రంగ', 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' వంటి చిత్రాలతో తనదైన ముద్ర వేసిన కృష్ణ చైతన్య ఈ ప్రాజెక్ట్‌ను తన కెరీర్‌లో కీలక చిత్రంగా భావిస్తున్నారు. కంటెంట్ బలంగా ఉండే కథలతో ప్రేక్షకులను ఆకట్టుకునే దర్శకుడిగా ఆయనకు ఉన్న పేరుతో ఈ సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయి.

నమ్ముతోంది. మరోవైపు సందీప్ ఇప్పటికే విజయ్ కుమారుడు జాసన్ విజయ్‌తో కలిసి 'సిగ్మా' చిత్రంలో నటిస్తుండగా, ఆ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. "పవర్ పేట" కథ విషయానికి వస్తే... ఒక సాధారణ వ్యక్తి ఎలా అసాధారణ శక్తిగా ఎదిగి, ఒక ప్రాంతాన్ని ప్రభావితం చేసే స్థాయికి చేరుకున్నాడనే నేపథ్యంతో సినిమా సాగుతుందని సమాచారం. పాత్ర కోసం సందీప్ కిషన్ తన లుక్, బాడీ లాంగ్వేజ్ పూర్తిగా మార్చుకుంటున్నట్లు తెలుస్తోంది. కథలో భాగంగా ఆయన మూడు డిఫరెంట్ షేడ్స్‌లో కనిపించనున్నారని టాక్. పీరియాడికల్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి భారీ సెట్స్, ఆర్ట్ వర్క్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. విభిన్న కథతో, బలమైన మేకింగ్‌తో "పవర్ పేట" ద్వారా సందీప్ కిషన్ మరోసారి తన రేంజ్ ఏంటో బాక్సాఫీస్‌కు చూపించాలనే లక్ష్యంతో ఉన్నారని టాలీవుడ్‌లో చర్చ నడుస్తోంది. టాలీవుడ్‌లో ప్రస్తుతం పీరియాడికల్ డ్రామాల ట్రెండ్ నడుస్తున్న వేళ సందీప్ కిషన్ ఈ మూవీతో ఎలాంటి రిజల్ట్ అందుకుంటాడో చూడాలి.



# క్రేజీ మల్టీస్టారర్

మన శంకర వరప్రసాద్ గారు' సినిమాతో డైరెక్టర్ అనిల్ రావిపూడి ఇండస్ట్రీ హిట్ కొట్టారు. ఈసారి దొరుకుతాడా లేదా? అనే డిస్కషన్స్ మధ్యలో వచ్చి, మరో బ్లాక్ బస్టర్ సక్సెస్ తన ఖాతాలో వేసుకుని టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారిపోయారు. వరుసగా తొమ్మిది విజయాలు అందుకున్న దర్శకుడిగా అరుదైన ఘనత వహించారు. దీంతో ఆయన 10సినిమాపై అందరి దృష్టి పడింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి అనేక వార్తలు ప్రచారంలో ఉన్న తరుణంలో, అనిల్ రావిపూడి తన కొత్త సినిమాను ప్రకటించారు.



విక్టరీ వెంకటేష్ , నందమూరి కళ్యాణ్ రామ్ హీరోలుగా తన నెక్స్ట్ మూవీని తెరకెక్కిస్తున్నట్లు అనిల్ రావిపూడి అధికారంగా ప్రకటించారు. వచ్చే సంక్రాంతికి ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మరోసారి స్పష్టం చేశారు. "మొదటి 'వందకోట్ల బొమ్మ' కొట్టిన హీరో వెంకటేష్ గారితో.. 'మొదటిసారి బొమ్మ' తీసే అవకాశం ఇచ్చిన హీరో కళ్యాణ్ రామ్ గారితో కలిసి 2027 మొదటి పండగకి మీ, ముందుకు వస్తున్నాం" అని అనిల్ ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా వెంకీ – కళ్యాణ్ రామ్‌లతో రూపొందించిన ఓ వీడియోని షేర్ చేసుకున్నారు.

'మన శంకర వరప్రసాద్ గారు' సక్సెస్ ప్రెస్ మీట్ లోనే అనిల్ రావిపూడి తన నెక్స్ట్ ప్రాజెక్ట్ గురించి మాట్లాడారు. తన పదో సినిమాకి ఐడియా క్రాక్ అయిందని, ఈసారి టైటిలే చాలా విచిత్రంగా ఉంటుందని, మళ్లీ వస్తున్నాడ్రా అని అనుకుంటారని తెలిపారు.

గత కొన్ని రోజులుగా వెంకటేశ్‌తో సినిమా ఉంటుందని, మలయాళ స్టార్ ఫాహద్ ఫాజిల్ కీ–రోల్ చేస్తున్నాడని, కీర్తి సురేశ్ కథానాయికగా చేస్తోందని, దానికి 'బామ్మర్ది బాల్ రెడ్డి' అనే టైటిల్ ఫైనల్ అయినట్లు వార్తలు వచ్చాయి. కాగా ఇన్నాళ్లు జరిగినట్లు ఫహాద్ కాకుండా ఆయన స్థానంలో కళ్యాణ్ రామ్ వచ్చినట్లు అర్థమవుతోంది. ఇక హీరోయిన్, సినిమా టైటిల్ విషయంలో క్లారిటీ రావాల్సి ఉంది. ఇదిలా ఉంటే. నందమూరి – కొణిదెల – అక్కినేని కుటుంబ హీరోలతో కలిసి నటించిన, నటిస్తున్న ఏకైక హీరోగా దగ్గుబాటి వెంకటేష్ సరికొత్త చరిత్ర సృష్టించారు.

# ఇన్‌స్పైరింగ్ జర్నీ!

సినిమా ఇండస్ట్రీలో బ్యాక్‌గ్రౌండ్ లేకుండా నిలబడటం అనేది చాలామందికి కలలా మారిపోతుంది. ప్రతిభ ఉన్నా సరైన అవకాశం దొరక్క వెనక్కి తగ్గే వారు ఎందరో. అయితే కొంతమంది మాత్రమే ఎలాగైనా కష్టపడి సాధించాలనే తపనతో ముందుకు సాగి తమ కలని నెరవేర్చుకుంటారు. అలాంటి వారిలో కోలీవుడ్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ పేరు ఇప్పుడు గట్టిగా వినిపిస్తోంది. సాధారణ మధ్యతరగతి యువకుడిగా ప్రారంభమైన ఆయన ప్రయాణం నేడు స్టార్ హీరో స్థాయికి చేరుకోవడం యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది.



చిన్నప్పటి నుంచే సినిమాలపై ఇష్టం పెంచుకున్న ప్రదీప్, తన తండ్రి నడిపే చిన్న జిరాక్స్ షాపులో పనిచేస్తూనే అవకాశాల కోసం వెతికారు. ఖాళీ సమయాల్లో షార్ట్ ఫిల్మ్స్ తెరకెక్కిస్తూ తన ప్రతిభను మెరుగుపరుచుకున్నారు. ఇంజనీరింగ్‌లో చదువుకుంటున్న రోజుల్లోనే 2015లో 'వాట్సాప్ కాదల్' అనే లఘు చిత్రాన్ని రూపొందించి నటన, ఎడిటింగ్, దర్శకత్వం అన్నింట్లోనూ తన సామర్థ్యాన్ని చూపించారు. ఈ షార్ట్ ఫిల్మ్స్ ద్వారానే ఆయనపై సినీ ఇండస్ట్రీ దృష్టి పడింది. దాని ఫలితంగానే 2019లో 'కోమలి' చిత్రంతో దర్శకుడిగా వెండితెరపై అడుగుపెట్టారు. తొలి సినిమాతోనే ప్రేక్షకులను ఆకట్టుకుని తనదైన ముద్ర వేసుకున్నారు. ఆ సమయంలో ఆయనకు అందిన రెమ్యునరేషన్ రూ.50 లక్షలే అయినా అది ఆయనకు పెద్ద గుర్తింపునిచ్చింది. దర్శకుడిగా విజయాన్ని అందుకున్న తర్వాత తనలోని నటుడిని ప్రేక్షకులకు పరిచయం చేయాలనుకున్న ప్రదీప్ స్వీయ దర్శకత్వంలో 'లవ్ టుడే' మూవీని తెరకెక్కించారు. ఈ వరుస విజయాలతో ప్రదీప్ రంగనాథన్ యూత్‌లో మినిమమ్ గ్యారెంటీ హీరోగా గుర్తింపు తెచ్చుకున్నారు. కథల ఎంపికలో కొత్తదనం, సహజ నటన, యూత్‌ను ఆకట్టుకునే డైలాగ్స్, మేనరిజం ఆయనకి ప్రత్యేకమైన ఫాలోయింగ్ తెచ్చాయి. ముఖ్యంగా సోషల్ మీడియా తరం ఎమోషన్స్‌ని పట్టుకుని సినిమాలు చేయడంలో ఆయనకు ఉన్న పట్టు ట్రేడ్ వర్గాల్ని ఆశ్చర్యపరుస్తోంది. రెమ్యునరేషన్ పరంగా చూస్తే ఆయన ఎదుగుదల మరింత షాకింగ్‌కి గురిచేయక మానదు. తొలి సినిమా 'కోమలి'కి రూ.50 లక్షలు తీసుకున్న ప్రదీప్, 'డ్యూడ్' సమయానికి రూ.10 కోట్లకు పైగా పారితోషికం అందుకున్నట్లు సమాచారం. ఇప్పుడు ఆయన క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకుని బడా బ్యానర్లు ఏకంగా రూ.25 కోట్ల వరకు ఇవ్వడానికి ముందుకొస్తున్నాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఏడేళ్లలో ఈ స్థాయి జంప్ సాధించడం నిజంగా అరుదైన విషయమే.

ప్రస్తుతం స్టార్ దర్శకుడు విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో రూపొందుతున్న 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'లో ప్రదీప్ నటిస్తున్నారు. ఇందులో ఆయనకు జోడిగా కృతి శెట్టి నటిస్తుండగా, ఎస్.జె. సూర్య కీలక పాత్రలో కనిపించనున్నారు. మార్చిలో విడుదలకు సన్నాహాలు జరుగుతున్నాయి. సాధారణ యువకుడిగా మొదలై కోట్లాది అభిమానుల మనసు గెలుచుకున్న ప్రదీప్ రంగనాథన్ ప్రయాణం... కష్టపడితే అసాధ్యం కానిదేదీ లేదని చెప్పే స్ఫూర్తిదాయక కథగా నిలుస్తోంది. ఒక బయోపిక్‌కి సరిపడా ట్విస్టులన్నీ ఆయన నిజ జీవిత కథలో కనిపిస్తున్నాయి. అన్నీ కుదిరితే అతడి జీవిత ప్రయాణం వెండితెరపై బయోపిక్‌గా వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు.



# కొత్త నిర్వచనం

పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంపై అంచనాలు భారీస్థాయిలో ఉన్నాయి. తాజాగా విడుదల చేసిన కొత్త పోస్టర్ ఆ అంచనాలను రెట్టింపు చేస్తున్నాయి. పవన్ హ్యాట్ ధరించి స్టైలిష్ గా కనిపిస్తున్న పోస్టర్, సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. విడుదలైన క్షణాల్లోనే వైరల్‌గా మారింది. అభిమానులు, సినీ ప్రియులు పవన్ కళ్యాణ్ అద్భుతమైన లుక్ కి ఫిదా అవుతున్నారు. ఈ సినిమాకు సంబంధించి ఏ అప్డేట్ వచ్చిన చక్కని ఆదరణ లభిస్తోంది. 'దేఖ్ లేంగే సాలా', 'ఆరా ఆఫ్ ఉస్తాద్' పాటలు చార్ట్‌బస్టర్‌లుగా నిలిచాయి. అన్ని వర్గాల నుంచి వెల్లువెత్తుతున్న ప్రేమాభిమానాలతో చిత్ర బృందం ఆనందం వ్యక్తం చేస్తోంది. ఈ ఉత్సాహాన్ని మరింత పెంచుతూ, త్వరలోనే చిత్రానికి సంబంధించిన పవర్‌ప్యాక్డ్ 40 సెకన్ల గ్లింప్స్‌ను విడు దల చేయడానికి నిర్మాతలు సిద్ధమవు తున్నారు. దీనితో మాస్ ఎలిమెంట్స్‌ను ప్రేక్షకు లకు చూపించనున్నారు. ఈ గ్లింప్స్ అభిమాను లకు అసలు సిసలైన మాస్ విందుని అందించనుంది. ఉస్తాద్ భగత్ సింగ్'లో పవన్ కళ్యాణ్‌ను మునుపెన్నడూ చూడని మాస్ అవతార్‌లో చూపించడానికి శాయశక్తులా కృషి చేస్తున్నారు దర్శకుడు. అన్ని అంశాల మేళవింపుతో పూర్తి వినోదభరిత చిత్రంగా ఇది రూపుదిద్దుకుంటోంది. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ తన సంగీతంతో చిత్రానికి మరింత హై వోల్టేజ్ ఎనర్జీని అందిస్తున్నారు. అంచనాలు ఆకాశాన్ని తాకుతున్న వేళ, ఉత్సాహం రోజురోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో, 'ఉస్తాద్ భగత్ సింగ్' మరోసారి మాస్ సినిమాకు కొత్త నిర్వచనం ఇవ్వడానికి సిద్ధంగా ఉంది' అని మేకర్స్ చెబుతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.

# రజినీకాంత్ కొడుకుగా

లోకనాయకుడు కమల్‌హాసన్ నిర్మాణంలో, సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా భారీ ఆసక్తి నెలకొంది. ఈ చిత్రం, కమల్ హాసన్ స్వంత బ్యానర్ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్‌పై రూపొందనుంది. దశాబ్దాల తర్వాత తమిళ సినీ ప్రపంచంలోని ఈ ఇద్దరు దిగ్గజాలు ఒకే ప్రాజెక్ట్ కోసం చేతులు కలపడం విశేషంగా మారింది. ఇప్పటికే విడుదలైన అనౌన్స్‌మెంట్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, అభిమానుల్లో అంచనాలను మరింత పెంచుతోంది."ప్రతి కుటుంబంలోనూ ఒక హీరో ఉంటాడు" అనే ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ ప్రాజెక్ట్ ఎమోషన్స్‌తో కూడిన పవర్‌ఫుల్ ఫ్యామిలీ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతుందనే టాక్ వినిపిస్తోంది. తాజా ప్రచారం ప్రకారం మలయాళ సినీ రంగానికి చెందిన నటుడు–దర్శకుడు బసిల్ జోసెఫ్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉందని తెలుస్తోంది.




రజనీకాంత్‌కు కుమారుడి పాత్రలో ఆయన కనిపించనున్నారనే వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. అదే సమయంలో మరో కీలక పాత్ర కోసం ప్రియాంక అరుళ్ మోహన్ పేరును కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ విషయాలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

బసిల్ జోసెఫ్ విషయానికి వస్తే, ఆయన కేవలం దర్శకుడిగానే కాదు, ప్రతిభావంతమైన నటుడిగానూ మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. 2013లో సహాయ దర్శకుడిగా సినీ ప్రయాణం ప్రారంభించిన బసిల్, తరువాత కుంజిరామాయణం, గోధా, మిన్నల్ మురళి వంటి చిత్రాలతో దర్శకుడిగా తన ప్రత్యేక ముద్ర వేశారు. ముఖ్యంగా 'మిన్నల్ మురళి' విజయంతో ఆయన పేరు దేశవ్యాప్తంగా వినిపించింది.
నటుడిగా కూడా జోజి, జాన్.ఇ.మ్యాన్, జయ జయ జయ జయ హే, పల్తు జాన్వర్, ఫలిమి వంటి సినిమాల్లో సహజమైన నటనతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. ఇటీవల తమిళ చిత్రం 'పరాశక్తి' క్లైమాక్స్‌లో ఆర్మీ ఆఫీసర్‌గా తళుక్కుమన్నారు. విభిన్న పాత్రలను ఎంచుకుంటూ తన క్రేజ్‌ను మరింత పెంచుకుంటున్న బాసిల్, ఇప్పుడు రజనీకాంత్‌తో స్క్రీన్ షేర్ చేసుకునే అవకాశం దక్కితే అది ఆయన కెరీర్‌లో కీలక మలుపు అవుతుందనే చెప్పాలి. మొత్తానికి 'రజనీ 173'పై రోజురోజుకీ పెరుగుతున్న అంచనాల మధ్య, నటీనటుల ఎంపికపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# అదరగొట్టాడుగా..

స్టార్ హీరోగా కోట్లాది అభిమానులను సంపాదించిన జూ. ఎన్టీఆర్ వ్యక్తిగత జీవితాన్ని మాత్రం చాలా గోప్యంగా ఉంచుతారు. కుటుంబానికి సంబంధించిన విషయాలు అంతగా బయటకు రానివ్వరు. కాకనోతే ఫంక్షన్లు, విహార యాత్రలకు వచ్చి పోయే సందర్భాల్లో వారి ఫొటోలు, వీడియోలు బయటకు వచ్చి కొద్ది రోజుల పాటు సోషల్ మీడియాల్లో హడావుడి చేస్తుంటాయి. అభిమానులు ఊడా వాటిని అపురూపంగా పరిగణిస్తూ వాటిని ఇతరులతో పంచుకుంటుంటారు. ఎన్టీఆర్‌కు ఇద్దరు కుమారులు.పెద్ద కుమారుడు అభయ్ రామ్ (11) , చిన్న కుమారుడు భార్గవ్ రామ్ (7) ఇద్దరూ హైదరాబాద్ ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ లో విద్యాభ్యాసం చేస్తున్నారని తెలిసింది. కాగా ఇటీవల వీరికి సంబంధించిన ఓ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. స్కూల్‌లో నిర్వహించిన డ్రాయింగ్ పోటీలో భార్గవ్ రామ్ పాల్గొనగా తన చేతిలో అప్పుడే వేసిన ఏనుగు పెయింటింగ్‌ను పట్టుకుని నిలబడ్డాడు. ఈ ఫొటో కాస్త బయటకు రావడంతో ఫ్యాన్స్ ఆ ఫొటోను తెగ వైరల్ చేస్తున్నారు. భార్గవ్ రామ్ డ్రాయింగ్‌కు అభినందనలు తెలుపుతున్నారు.






Uttejitha:-Printed,editor,Pablished And owned By M.chandrasek her.46-801u2.Budhawerpeta.kurnool.andrapradesh.pin 518002.printed At Uttejitha -Printers.Kurnool.Ap.cell 9440140418. RNI ApTEEL2008/24570.